ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
మంగళవారం 10 సెప్టెంబరు 2024



ఉధృతంగా సువర్ణముఖి

సాలూరు రూరల్: ఏవోబీలో ఒడిశా కొండల్లో సోమవారం భారీ వర్షాలు కురవడంతో మండల పరిధిలో సువర్ణముఖీ నదికి వరద పోటెత్తింది. దీంతో మామిడిపల్లి వంతెన వద్ద పొలాలు నీట మునిగాయి. మరోవైపు వెంగళరాయసాగర్ నుంచి 600 క్యూసెక్కులను కిందకు విడుదల చేశారు.



మామిడిపల్లి వంతెన వద్ద సువర్ణముఖి నదిలో వరద ప్రవాహం ఇలా..

- వర్షాలు ఆగినా తొలగని గండం
- ఉధృతంగా ప్రవహిస్తున్న నదులు, గెడ్డలు
- నిండుగా చెరువులు.. నీటిలోనే పంటలు
- ఒడిశాలో తీరం దాటిన వాయుగుండం
- అయినా జిల్లాలో వర్షాలు పడే అవకాశం

వీడని వరద



పాలకొండ: వీపీరాజుపేట జంక్షన్ వద్ద చెరువులను తలపిస్తున్న పంట పొలాలు

పార్వతీపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షాలు ఆగినప్పటికీ ఇంకా వరద గండం వీడలేదు. గెడ్డలు, వాగులు, వంకల్లో ప్రవాహ తీవ్రత పూర్తిస్థాయిలో తగ్గలేదు. పంట పొలాలు చెరువుల్లా కనిపిస్తున్నాయి. రిజర్వాయర్లలో నీటి మట్టాలు అధికంగానే ఉన్నాయి. ఇంకా వరద ఉధృతి పెరగొచ్చని అధికారులు భావిస్తున్నారు. మరోవైపు వారు నష్టం అంచనాల్లో తలమునకలయ్యారు. వాయుగుండం కారణంగా జిల్లాలో శనివారం రాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకూ ఎడతెరిపి లేని వాన కురిసిన సంగతి తెలిసిందే. దీంతో లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రోడ్లు, కూడళ్లు జలమయమయ్యాయి. నాగావళి, వంశధార నదులు, చెరువులు, వాగులు, వంకలకు వరద పోటెత్తగా.. జిల్లాలో పలుచోట్ల వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. అరటి, మొక్కజొన్న పంటలు నేలవాలాయి. ప్రస్తుతం వాయుగుండం ఒడిశాలో తీరం దాటినప్పటికీ జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. ప్రాజెక్టుల వద్ద నీటి మట్టాలను పరిశీలించారు. వరద పోటెత్తుతున్న నేపథ్యంలో రిజర్వాయర్ల గేట్లు తెరిచి దిగువకు నీటిని విచిడిపెట్టారు. మరోవైపు నదీతీర ప్రాంతవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. కాగా జిల్లాలో అత్యధికంగా భామిని మండలంలో 79.6 మిల్లీ మీటర్లు, అత్యల్పంగా మక్కువ మండలంలో 5.2 మిల్లీమీటర్ల మేర వర్షపాతం నమోదైంది.

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు ఇలా..

తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు వద్ద ఎఫ్ఆర్ఎల్ 105 మీటర్లు ఉండాల్సి ఉండగా, 104.7 మీటర్ల మేర నీటి నిల్వ ఉంది. వట్టిగెడ్డ వద్ద 121 మీటర్లకు గాను 118 మీటర్లు, పెద్దగెడ్డలో 213 మీటర్లకు 212.4 మీటర్లు, వీఆర్ఎస్ వద్ద 161 మీటర్లుకు గాను 159.55 మీటర్ల మేర నీటి నిల్వలు ఉన్నాయి.

వివిధ చోట్ల ఇలా...

- మక్కువ మండలం శంబర గ్రామంలో 15 ఎకరాల్లో అరటి, జియమ్మవలసలో ఒకటి, పాలకొండలో రెండు ఇళ్లు పూర్తిగా నేలమట్టమయ్యాయి. బాసంగిలో మూడు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి.
- పాలకొండ మండలంలో ఎల్ఎల్‌పురంలో ఓ పూరిల్లు కూలిపోవడంతో ఆ కుటుంబ సభ్యులకు సచివాలయంలో ఆశ్రయం కల్పించారు.
- భారీ వర్షాలకు అలికాం-బత్తిలి రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దాని మరమ్మతుల కోసం సుమారు రూ.60 లక్షలతో ప్రతిపాదనలు వెళ్లాయి.

ముంపులో పంట పొలాలు..

పాలకొండ: వాయుగుండం కారణంగా జిల్లాలో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని వందలాది ఎకరాల పంట పొలాలు నీటమునిగాయి. పాలకొండ మండలంలోని జంపరకోటగెడ్డ, ఓనిగెడ్డ, రావాడ గెడ్డ, గజిలిగెడ్డలు ఉధృతంగా ప్రవహించడంతో వీపీరాజుపేట, తుమరాడ, తంపటాపల్లి, అర్ధలి, మంగళాపురం, బుక్కూరు, గోపాలపురం, పాలకొండలో వరి పొలాలు పూర్తిగా ముంపునకు గురై చెరువులను తలపిస్తున్నాయి. మరో రెండు రోజులు ఇలానే ఉంటే పంటకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా పాలకొండ-వీరఘట్టం ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి నుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు కమిటీలు


పార్వతీపురం, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలను దీటుగా ఎదుర్కోవడానికి కమిటీలను ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడారు. జిల్లాలో 86 శాతం అధికంగా వర్షపాతం నమోదైందని ఆయన తెలిపారు. అధికారుల సమన్వయంతో పనిచేసి ఎక్కడా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవడం గొప్ప విషయమన్నారు. అదే స్ఫూర్తితో ఇక ముందు కూడా పనిచేయాలని సూచించారు. భారీ వర్షాలకు దెబ్బతిన్న పంచాయతీరాజ్ రోడ్ల మరమ్మతులకు అంచనాలు తయారు చేసి పంపించాలని తెలిపారు. వసతిగృహాల్లో విద్యార్థులకు వేడి, వేడి ఆహారం అందించాలన్నారు. వాగులు, వంకలు పొంగినప్పుడు రాకపోకలు నిషేధించాలని ఆదేశించారు. వర్షాలకు ఇళ్లు దెబ్బతిన్న వారికి పరిహారం అందించాలని చెప్పారు. పల్లెల్లో పారిశుధ్య నిర్వహణలో స్థానికులను భాగస్వాములుగా చేయాలని సూచించారు. ఎక్కడైనా చెత్త కనిపిస్తే.. సంబంధిత గ్రామ సెక్రటరీ బాధ్యులవుతారని స్పష్టం చేశారు.



నాగావళిలో వరద ప్రవాహం

గుమ్మగెడ్డ వద్ద గండి..

సీతంపేట రూరల్: భారీ వర్షాలకు వరద పోటెత్తడంతో గొయిది సమీపంలో ఉన్న గుమ్మగెడ్డ రిజర్వాయర్ కుండి వద్ద గండి పడింది. దీంతో సుమారు 20 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. గండి పూడ్చి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



గండి కారణంగా వృథాగా పోతున్న నీరు

నాగావళికి పోటెత్తిన వరద

గరుగుబిల్లి: తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని నాగావళికి సోమవారం వరద పోటెత్తింది. వాయుగుండం కారణంగా జిల్లాతో పాటు ఒడిశాలో కురిసిన భారీ వర్షాలకు నదిలో 5,100 క్యూసెక్కులు చేరింది. దీంతో అధికారులు అప్రమత్తమై ప్రాజెక్టు స్పిల్ వే గేట్లు నుంచి దిగువకు 2,200 క్యూసెక్కులను విడుదల చేశారు. మరోవైపు ఎడమ ప్రధాన కాలువ నుంచి 150 క్యూసెక్కులు, పాత రెగ్యులేటర్ పరిధిలోని కుడి కాలువ నుంచి 40 క్యూసె క్కుల నీటిని సరఫరా చేశారు. గండ్లు పడే అవకాశం ఉండడంతో కుడి ప్రధాన కాలువ నుంచి సాగునీరు నిలుపుదల చేశారు. ఒడిశాలో వర్షాలు కురుస్తుండడం వల్ల వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నందున నదీ తీర ప్రాంతవాసులను అప్రమత్తం చేశామని డీఈ టి.రఘునాథనాయుడు, జేఈలు కె.శ్రీనివాసరావు, బి.కిషోర్‌కుమార్ తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో ఎవరూ చేపల వేటకు వెళ్లకుండా హెచ్చరికలు జారీ చేశామని చెప్పారు. నదిలో వరద పెరిగితే దిగువకు నీటిని విడుదల చేయనున్నామన్నారు.

కోతకు గురవుతున్న ఒడ్డు..

అధిక వర్షాల కారణంగా ప్రాజెక్టుకు ఇరువైపులా ఉన్న ఒడ్లు కోతకు గురవుతున్నాయి. దీంతో నదీతీర ప్రాంతవాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వరద ప్రవాహం పెరిగితే పంట పొలాలు, సమీపంలో ఉన్న రహదారి దెబ్బతినే అవకాశం ఉందని, పది గ్రామాలకు రాకపోకలు నిలిచిపోనున్నాయని వారు వాపోతున్నారు. వాస్తవంగా కుడి, ఎడమ ఒడ్లు కోతకు గురికాకుండా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొంతమేర పనులు చేపట్టారు. అయితే బిల్లులు చెల్లించకపోవడంతో పనులకు బ్రేక్ పడింది. దీంతో ఏటా వర్షాకాలంలో కోతలు పెరుగుతూనే ఉన్నాయి. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.



కుడి వైపు కోతకు గురవుతున్న ఒడ్డు

పెద్దగెడ్డ నీరు విడుదల

పాచిపెంట: వాయుగుండం కారణంగా రెండు రోజులుగా కురిసిన వర్షాలకు పెద్దగెడ్డ జలాశయంలో నీటి ప్రవాహం పెరిగింది. శుక్రవారం సాయంత్రం స్పిల్‌వే ద్వారా 520 క్యూసెక్కులు, ప్రధాన కుడి కాలువ ద్వారా 30 క్యూసెక్కులను విడుదల చేశారు. ఇన్‌ఫ్లో పెరిగితే.. దిగువకు మరిన్ని క్యూసెక్కుల నీటిని విడుదల చేయనున్నట్లు జలాశయం అధికారులు వెల్లడించారు.

నిలకడగా వంశధార

భామిని: నేరడి వద్ద వంశధార నదిలో వరద నిలకడగానే ఉంది. అయితే ఎగువన ఉన్న ఒడిశాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున సోమవారం రెవెన్యూ సిబ్బంది నదీతీర ప్రాంతవాసులు అప్రమత్తం చేశారు. అయితే ఇప్పటికీ సులకజోడు, బురుజోల, వడ్డంగి, పసుకుడి చెరువులకు పూర్తిస్థాయిలో నీరు చేరకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

జంఝావతిని పరిశీలించిన కలెక్టర్..

జియ్యమ్మవలస / కొమరాడ, సెప్టెంబరు 9: కొమరాడ మండలంలో సోమవారం కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా జంఝావతి ప్రాజెక్టును సందర్శించారు. జిల్లాలో భారీగా వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రాజెక్టు వద్ద వరద ఉధృతి, ప్రస్తుత నీటి మట్టం పరిశీలించారు. ప్రాజెక్టు వివరాలను నీటి పారుదలశాఖ ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో రబ్బరు డ్యామ్ దెబ్బతినకుండా ముందస్తుగా మూసివేసినట్లు ఇంజనీరింగ్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. సాధారణ స్థితికి వచ్చిన తర్వాత కాలువల ద్వారా సాగునీరందిస్తామని తెలిపారు. అనంతరం పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణాన్ని కలెక్టర్ పరిశీలించారు. 12 స్లాబ్‌ల్లో ఏడు పూర్తయ్యాయని ఇంజనీరింగ్ అధికారులు వివరించారు. ఈ వంతెనపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చిన నేపథ్యంలో త్వరితగతిన పనులు పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆతర్వాత ఆయన కళ్లికోట ఇసుక రీచ్‌లను పరిశీలించారు. ఆర్డీవో కె.హేమలత, జంఝావతి ప్రాజెక్టు ఎస్ఈ ఎస్.జగదీశ్వరరావు, డీఈ ఎ.డిల్లేశ్వరరావు, ఏఈ అభిషేక్ వర్మ, తహసీల్దార్ రమేష్‌కుమార్, పీఆర్ ఇంజనీరింగ్ అధికారి పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



జంఝావతి ప్రాజెక్టు వద్ద మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్



పెద్దగెడ్డ స్పిల్‌వే ద్వారా నీరు విడుదల చేసిన దృశ్యం

అందరికీ ఎలా?



- మారిషస్ పైనాపిల్ సక్కర్స్ టెండర్లపై అనుమానాలు
- టెండర్‌దారులందరికీ మొక్కల సరఫరాకు అనుమతులు
- అధికారుల తీరుపై సందేహాలు

సీతంపేట రూరల్, సెప్టెంబరు 9: ఐటీడీఏ పరిధిలో గిరిజన రైతులకు అందించనున్న మారిషస్ పైనాపిల్ మొక్కల సరఫరాకు సంబంధించి ఇటీవల నిర్వహించిన టెండర్ విధానంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టెండర్లపై పాల్గొన్న వారందరికీ మొక్కల సరఫరాకు అనుమతులు ఇవ్వడంపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తక్కువ ధరకు కోడ్ చేసిన వారిని కాకుండా ఐటీడీఏ అధికారులు ఇలా..ఎలా? చేశారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ప్రయోగాత్మకంగా...

సీతంపేట, భామిని మండలాల పరిధిలో సుమారు 90 ఎకరాల్లో కేరళ రకానికి చెందిన మారిషస్ పైనాపిల్ మొక్కలను ప్రయోగాత్మకంగా పెంచాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు గత నెల 31న సీతంపేట ఐటీడీఏలో ఇన్‌చార్జి పీవో వీవీ రమణ ఆధ్వర్యంలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. 7.20లక్షల మారిషస్ పైనాపిల్ సక్కర్స్ సరఫరాకు సంబంధించి మొత్తంగా 11మంది టెండర్‌దారులు పాల్గొన్నారు. కాగా నిబంధనల ప్రకారం ఎవరైతే తక్కువ ధర కోడ్ చేస్తారో వారికే ఈ టెండర్‌ను ఖరారు చేయాల్సి ఉంది. కానీ ఐటీడీఏ అధికారులు అలా చేయలేదు. టెండర్‌లో పాల్గొన్న 11 మందికి పైనాపిల్ సక్కర్స్ సరఫరాకు అనుమతులు ఇచ్చారు. ఒక్కో మొక్క ధరను రూ.19గా నిర్ణయించారు. నిర్దేశించిన గడువులోగా సక్కర్స్ సరఫరా చేయాలని టెండర్‌దారులకు ఆదేశాలు జారీ చేశారు. అయితే అధికారులు సీల్డ్ టెండర్‌ను నిర్వహించినప్పటికీ ఈ విధంగా టెండర్‌లో పాల్గొన్న వారందరికి మొక్కల సరఫరా చేసేందుకు సంబంధించి అనుమతులు ఎలా ఇచ్చారనే దానిపై పలు సందేశాలు వ్యక్తమవుతున్నాయి. కాగా ఈ నెల 20న 7.20లక్షల పైనాపిల్ సక్కర్స్‌ను గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీపై అందించేందుకు ఐటీడీఏ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే మరో రెండు రోజుల్లో మొదటి విడతగా 60 వేల పైనాపిల్ సక్కర్స్ తురాయిపువలస ఉద్యానవన నర్సరీకి రానున్నాయి.



మారిషస్ పైనాపిల్ సక్కర్స్

తక్కువ ధర కాదని..

టెండర్‌లో పాల్గొన్న 11 మందిలో కడియం ప్రాంతానికి చెందిన గ్లోబల్ నర్సరీ సంస్థ రూ.15కు మొక్కల పంపిణీ చేసేందుకు ముందు కొచ్చింది. అయితే దీనిని అధికారులు తిరస్కరించారు. సీల్డ్ టెండర్‌లో టెండర్‌దారులు కోడ్ చేసిన తక్కువ ధర కాదని నెగోషిబుల్ పేరుతో రూ.19కి ధరను ఖరారు చేశారు. ఒక్కో టెండర్ దారుడు సుమారు 65,454 వేల పైనాపిల్ సక్కర్స్‌ను సరఫరా చేసే విధంగా ఏర్పాట్లు చేశారు. అయితే అధికారులు ఇలా ఎందుకు చేశారనేది ఎవరికీ అర్థం కావడం లేదు.



సీతంపేట ఉద్యాన కేంద్రం

కేరళ రకం సక్సెస్ అయ్యేనా?

కేరళలో రైతులకు అధిక లాభాన్ని చేకూర్చే పంటల్లో ప్రధానమైనది ఈ మారిషస్ పైనాపిల్. ఇది ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది. పైగా అక్కడి వాతావరణం, సారవంతమైన నేల ఆ పంటకు అనుకూలం. అందుకే పూర్తిస్థాయిలో దిగుబడులు వస్తుంటాయి. కానీ ఇక్కడ పరిస్థితులు వేరు. సీతంపేట ఏజెన్సీలో సకాలంలో వర్షాలు తక్కువ. ఎండ తీవ్రత ఎక్కువ. తరచూ వాతావరణ మార్పుల కారణంగా కేరళ రకానికి చెందిన పైనాపిల్ ఈ ప్రాంతంలో ఎంతవరకు విజయవంతమవుతుందనేది సర్వత్రా చర్చనీయాంశమవుతోంది.

లాభపడుతున్న దళారులు

ఐటీడీఏ పరిధిలోని సీతంపేట, భామిని, హిరమండలం, మెళియాపుట్టి, పాతపట్నం, కొత్తూరు మండలాల్లో పైనాపిల్ సాగు ఎక్కువగా ఉంది. అయితే సింహాచలం రకానికి చెందిన లోకల్ వెరైటీ పైనాపిల్ మాత్రమే ఇక్కడ సాగవుతోంది. ఈ రకానికి చెందిన పంట మూడు రోజులకు మించి నిల్వ ఉండదు. పైగా ఈ పంటలో పులుపు ఎక్కువగా ఉంటుంది. మరోవైపు ఐటీడీఏలో కోల్డ్ స్టోరేజీ సౌకర్యం లేకపోవడంతో గిరిజన రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో తక్కువ ధరకు పైనాపిల్‌ను విక్రయిస్తున్నారు. దీంతో దళారులు ఆర్థికంగా లాభపడుతున్నారు.

పీహెచ్‌వో ఏమన్నారంటే...

'కేరళ రకానికి చెందిన మారిషస్ పైనాపిల్ మొక్కల సక్కర్స్‌కు తీవ్ర డిమాండ్ ఉంది. అందుకే టెండర్‌లో పాల్గొన్న వారందరికి సక్కర్స్ సరఫరాకు అనుమతులు ఇచ్చాం. ఏ ఒక్కరో అయితే వాటిని ఇన్‌టైంలో సరఫరా చేయలేరనే ఉద్దేశంతోనే ఇలా చేశాం. తొమ్మిది మంది సభ్యులతో అధ్యయన కమిటీ వేసి... ఈ రకం పైనాపిల్ గిరిజన ప్రాంతంలో ఎంత వరకు సక్సెస్ అవుతుందో గుర్తించాం. ఆ నివేదిక ఆధారంగానే కేరళ మారిషస్ మొక్కలను సీతంపేటకు పరిచయం చేస్తున్నాం. ఇప్పుడు తెప్పిస్తున్న 7.20 లక్షల పైనాపిల్ మొక్కలు కూడా శాంపిల్స్ మాత్రమే. ఇక్కడ దిగుబడి ఆధారంగా మరిన్ని మొక్కలను తెప్పించి.. గిరిజన రైతులకు పంపిణీ చేస్తాం. వాటితో ఏడాదికి మూడు సార్లు దిగుబడులు పొందే అవకాశం ఉంది.' ఐటీడీఏ ఉద్యానవన శాఖ అధికారి వెంకట గణేష్ తెలిపారు.

ఇంటి బాట పట్టిన ఏకలవ్య విద్యార్థులు

సీతంపేట: మల్లి వీవీటీజీ రెసిడెన్షియల్ పాత భవనంలో ఉంటున్న ఏకలవ్య పాఠశాల విద్యార్థులు ఇంటి బాట పడుతున్నారు. అక్కడ కనీస సౌకర్యాలు లేకపోవడం, వర్షాలకు గదులు కారిపోతుండడంతో విద్యార్థులు గొడుగులేసుకుని బిక్కుబిక్కుమంటూ ఉండాల్సి వస్తోందని తెలియడంతో.. వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందారు. ఈ మేరకు సోమవారం వారు మల్లి వసతిగృహానికి చేరుకుని తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న ఐటీడీఏ ఉపవిద్యాశాఖాధికారి పాలక నారాయుడు, సహాయ గిరిజన సంక్షేమాధికారి మంగవేణి, జీసీడీవో రాములమ్మ, ఏఎంవో చిరంజీవులు హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అయితే అప్పటికే కొంతమంది విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి ఇళ్లకు వెళ్లిపోయారు. ప్రస్తుతం 35 మంది మల్లి రెసిడెన్షియల్‌లో ఉన్నారని, మిగతా వారిని కూడా రెండు రోజుల్లో రప్పిస్తామని ఉప విద్యాశాఖాధికారి నారాయుడు తెలిపారు. సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని, ఏకలవ్య విద్యార్థులకు పూర్తిస్థాయిలో వసతి కల్పిస్తామని ఆయన చెప్పారు.



తల్లిదండ్రులతో కలిసి ఇంటి బాట పడుతున్న ఏకలవ్య విద్యార్థులు



6G టెక్నాలజీ భారత్ సంసిద్ధత

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

దిక్సూచి DIKSUCHI

కొన్ని ఆవిష్కరణలు ప్రపంచ గతినే మార్చివేస్తాయి. అలాంటి ఆవిష్కరణలుగా నిప్పు, చక్రం, ఆవిరి యంత్రాలు, కరెంటు, కంప్యూటర్లు, ఇంటర్నెట్ వంటి వాటిని పేర్కొనవచ్చు. అయితే ఈ ఆవిష్కరణలు పనిలో మానవ ప్రమేయాన్ని తగ్గిస్తూ వచ్చాయి. కానీ మరో అయిదారేళ్లలో అందుబాటులోకి రాబోతున్న 6జీ టెక్నాలజీ పనిలో మానవ ప్రమేయాన్ని అసాంతం తగ్గించనుంది. ప్రస్తుత 5జీ టెక్నాలజీ మానవ-రోబో సమన్వయంతో పనులు చక్కబెట్టడానికి వీలుకల్పిస్తుండగా, రాబోతున్న 6జీ టెక్నాలజీ కృత్రిమ మేధకు మరింత వేగాన్ని అందించి అనేక రంగాల్లో మానవ ప్రమేయాన్ని దాదాపు శూన్యం చేయనుంది. ఉదాహరణకు స్వయంచోదక వాహనాలు(డ్రైవర్‌లెస్ కార్లు)ను చెప్పుకోవచ్చు.

● ఈ అధునాతన 6జీ సాంకేతికతను అందిపుచ్చుకుని అందరికన్నా ముందుగా ప్రపంచ విపణిలో మార్కెట్ అవకాశాలను కొల్లగొట్టడానికి ప్రపంచ దేశాలు పోటీ పడుతున్నాయి. ఈ తరుణంలో భారత్ కూడా రంగంలోకి దిగింది. 2030 నాటికల్లా 6జీ టెక్నాలజీని ప్రవేశపెట్టడానికి గల సాధ్యాసాధ్యాల పరిశీలన, సూచనల నిమిత్తం ఎ.కె.తివారీ అధ్యక్షతన ఒక టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసింది.

● తదనంతరం '6 మూలస్తంభాల వ్యూహంతో 6జీ విజన్'ను తదుపరి '6జీ మిషన్'ను భారత టెలీ కమ్యూనికేషన్స్ శాఖ ప్రవేశపెట్టడమే కాక అంతర్జాతీయ పరస్పర సహకారం నిమిత్తం భారత్ 6జీ అలయెన్స్(బీ6జీఏ)ను కూడా ఏర్పాటు చేసింది. ఈవిధమైన కార్యాచరణల నేపథ్యంలో అసలు 6జీ టెక్నాలజీ అంటే ఏమిటి? ప్రస్తుత తరం 5జీ టెక్నాలజీతో పోల్చిన ఏవిధంగా మెరుగైనది? 6జీ సాంకేతికత కోసం జాతీయంగా అంతర్జాతీయంగా జరుగుతున్న ప్రయత్నాలేమిటి? అన్న కోణంలో పరిశీలన జరపాల్సి ఉంది.

6జీ అంటే?

● వైర్‌లెస్ టెలీ కమ్యూనికేషన్ టెక్నాలజీని దాని పరిణామ క్రమం ఆధారంగా వివిధ జనరేషన్లుగా విభజించి పేర్కొంటారు. ఈవిధంగా ఇప్పటివరకూ 1 నుంచి 5 తరాలు అందుబాటులోకి రాగా, మరింత అభివృద్ధి చెందిన తరంగా రాబోతున్న తదుపరి తరాన్ని 6వ తరం గా పేర్కొంటున్నారు.

5జీతో పోల్చితే 6జీ ఏవిధంగా మెరుగైనది?

● వేగపరంగా 5జీ ఒక మిల్లీ సెకన్(1000 మైక్రో సెకన్లు)లో 20 గిగాబైట్ల డేటాను అందిస్తుంది. అదే 6జీ 1 మైక్రో సెకన్‌లో వెయ్యి గిగాబైట్ల(ఒక టెరాబైట్) డేటాను అందిస్తుంది. అంటే 6జీ సాంకేతికత వేగంలో 5జీ కన్నా వెయ్యిరెట్లు మెరుగైనది.

● అదేవిధంగా లేటెన్సీ అనగా నెట్‌వర్క్‌లోని ఒక పాయింట్ నుంచి మరో పాయింట్‌కు సమాచారం(డేటా) చేరడానికి పట్టే సమయం(జాప్యం)ను, 5జీతో పోల్చిన 6జీ విపరీతంగా తగ్గిస్తుంది. 5జీలో ఈ లేటెన్సీ 5 మిల్లీ సెకన్లు కాగా, 6జీతో 'అల్ట్రాలో లేటెన్సీ(అతి తక్కువ జాప్యం)' సాధ్యపడి ఒక మైక్రో సెకనుకు ఈ జాప్యం పరిమితం అవుతుందని అంచనా. ఇంతవరకూ ఉపయోగించని 'టెరా హెర్ట్జ్ పౌనఃపున్యాలను 6జీ సాంకేతికతలో వినియోగించనుండటంతో అల్ట్రాలో లేటెన్సీ సాధ్యం కానుంది. టెరా హెర్ట్జ్ పౌనఃపున్యాలు విద్యుదయస్కాంత వర్ణ పటంలో పరారుణ తరంగాలు, మైక్రోవేవ్ తరంగాల మధ్య ఉంటాయి. చాలా సూక్ష్మంగానూ, సున్నితంగానూ ఉండే ఈ తరంగాలు భారీస్థాయిలో డేటాను వేగంగా చేరవేయగలవు.

● 5జీ సాంకేతికత 'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్'ను ప్రవేశపెట్టడానికి సహకరించి, మానవుల నుంచి యంత్రానికి కమ్యూనికేషన్‌ను సాధ్యం చేసింది. ఈ పునాదిపై మరింత విస్తృతీకరించిన 6జీ సాంకేతికత మెషిన్ టు మెషిన్ కమ్యూనికేషన్‌ను(యంత్రాల మధ్య సమాచార బదిలీ) సాధ్యపరిచింది. ఇది చాలా వేగంగా జరిగే కమ్యూనికేషన్ కావడంతో మానవ మెదళ్లు గ్రహించగలవు.

6జీ టెక్నాలజీ ద్వారా రానున్న మార్పులు

1. కమ్యూనికేషన్ల పరంగా: నెట్‌వర్క్ స్లైకింగ్ ప్రక్రియ ద్వారా విస్తృత నెట్‌వర్క్‌లను అతి చిన్న ప్రత్యేక నెట్‌వర్క్‌లుగా విభజించడం వల్ల వివిధ రకాల సమాచార రద్దీని ప్రాధాన్యతల ఆధారంగా విభజించి నిర్వహించడానికి అవకాశం ఉంది. అదేవిధంగా సమాచార ప్రసారంలో విస్తృతస్థాయిలో భద్రత లభిస్తుంది. ఎన్‌క్రిప్షన్, హోలో గ్రాఫిక్ కమ్యూనికేషన్, మెరుగైన కృత్రిమమేధ, ఎక్స్‌టెండెడ్ రియాలిటీల ద్వారా మరింత భద్రతతో పాటు స్పష్టత, నిజ సమయ సమాచార బదిలీ(రియల్ టైమ్ డేటా ట్రాన్స్‌ఫర్) సాధ్యమవుతాయి. మరింత వేగంగా ఫైల్ డౌన్ లోడింగ్, వెబ్‌సెర్ఫ్, వర్చువల్ రియాలిటీ, సమాచార మార్పిడి సాధ్యమవుతాయి.

2. రవాణారంగం: వేగం, లేటెన్సీల పరంగా, మెషిన్ టు మెషిన్ కమ్యూనికేషన్స్, కృత్రిమ మేధ, త్రీడీ సాంకేతికతలతో ఈ 6జీ టెక్నాలజీ తీసుకువచ్చే మార్పుల కారణంగా స్వయం చోదిత వాహనాలు(డ్రైవర్ లెస్ కార్లు), ఎయిర్ ట్రాఫిక్ నియంత్రన; బుల్లెట్ ట్రైన్స్ వంటి రవాణారంగ అంశాల్లో విప్లవాత్మక మార్పులు రానున్నాయి.

3. స్మార్ట్ సిటీస్, గ్లోబల్ కనెక్టివిటీ: రియల్ టైమ్ మానిటరింగ్, గ్లోబల్ కనెక్టివిటీ(ప్రజలు, పరికరాలు, సిస్టమ్స్, వివిధ సంస్థల మధ్య నిరంతర అనుసంధానత) వల్ల ట్రాఫిక్ నుంచి, ఫ్రిజ్‌లో సరుకుల వరకూ అన్నిటి సమాచారం అప్రయత్నంగా బదిలీ అయిపోతున్నాయి. అనుసంధానతలు పెరగడం వల్ల పట్టణ-గ్రామ అంతరాలు తొలగిపోతాయి.

4. విద్య, పరిశోధన రంగాలు: విద్యార్థులకు విద్యారంగంలో ప్రపంచవ్యాప్త అనుసంధానత ఏర్పడుతుంది. వర్చువల్ క్లాసెస్, టీచర్స్, క్లాస్‌మేట్స్‌తోపాటు సమాచార విశ్లేషణ రియల్ టైమ్ ఎక్స్‌పీరియన్స్(అనుభవ పూర్వక అధ్యయనం) సాధ్యమవుతాయి. అదేవిధంగా అన్ని రంగాల్లో సంక్లిష్ట అంశాలపరంగా కూడా పరిశోధనకు అవకాశం ఏర్పడుతుంది. పరిశోధనల్లో వేగం సాధ్యమవుతుంది.

5. ఆరోగ్యరంగం: టెలీ మెడిసిన్, కృత్రిమమేధ మద్దతుతో క్లిష్టమైన శస్త్రచికిత్సలు కూడా రోబోటిక్ పద్ధతిలో నిర్వహించడం, వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో వేగం, వైద్యులతో అనుసంధానత మొదలైన సౌలభ్యాలు కలుగనున్నాయి.

6. వ్యవసాయ, వ్యాపార, ఆర్థిక రంగాలు: వ్యవసాయ, వ్యాపార రం గాల్లో డిమాండ్ - సప్లయ్ - ఉత్పత్తి నియంత్రణపరంగా తక్షణ సమాచార బదిలీ విస్తృతస్థాయిలో వివిధ వ్యవస్థల మధ్య జరిగి మార్కెట్లు విస్తరిస్తాయి. నష్టభయం తగ్గుతుంది. వేగవంతమైన కృత్రిమమేధతో నిర్ణయాలు, విశ్లేషణ, ఆచరణపరమైన జాప్యాన్ని నివారించవచ్చు. ఇవి సమిష్టిగా ఆర్థికవ్యవస్థ పురోభివృద్ధికి దోహదం చేస్తాయి.

7. అంతరిక్ష రంగం, రక్షణ రంగం, విపత్తు నిర్వహణ: అంతరిక్ష ప్రయోగాల్లో రియల్ టైమ్ మానిటరింగ్ అండ్ కంట్రోల్ ద్వారా వాహక నౌకలు, రోబోలు వంటి వాటిని తక్షణం నియంత్రిస్తూ వైఫల్యాలను తగ్గించవచ్చు. అత్యధిక రిజల్యూషన్‌తో కూడిన చిత్రాలు ఖగోళ పరిస్థితుల, పదార్థాల విస్పష్ట అంచనాకు సహకరిస్తాయి. అదేవిధంగా సుదూర ఖగోళ అన్వేషణ సాధ్యమై దూరాన ఉన్న నక్షత్రాలు, గ్రహాల సమాచారం లభ్యమవుతుంది. మెషిన్ టు మెషిన్ కమ్యూనికేషన్, వేగం వల్ల వివిధ రకాల భౌగోళిక పరిస్థితుల్లో, సరిహద్దుల్లో, యుద్ధ, విపత్తు పరిస్థితుల్లో ఎంతో ప్రయోజనకరం.

8. పర్యావరణం: ఆగ్‌మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వల్ల ప్రయాణ అవసరాలు తగ్గి కార్బన్ ఫుట్‌ప్రింట్ తగ్గుతుంది. అదేవిధంగా స్మార్ట్ సిటీస్, స్మార్ట్ మీటర్స్ వంటి వాటివల్ల విద్యుత్, నీరు వృథా తగ్గి పర్యావరణానికి మేలు చేకూరుతుంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

(మిగతా రేపటి దిక్సూచిలో..)

నవ్య | చిత్రజ్యోతి



జాగ్రత్త సుమా!

సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే తారల్లో రష్మిక మందన్న ఒకరు. అయితే ఆమె పోస్టులు పెట్టి నెల రోజులయింది. ఈ స్వల్ప విరామానికి గల కారణాన్ని ఆమె తాజాగా అభిమానులతో పంచుకున్నారు. "నెల క్రితం నాకు ఓ ప్రమాదం జరిగింది. ఎవరూ కంగారు పడాల్సిన పనిలేదు. గాయం చిన్నదే. వైద్యుల సలహా మేరకు ఇంటిపట్టునే ఉండి విశ్రాంతి తీసుకుంటున్నాను. త్వరలోనే సినిమా సెట్స్‌లోకి అడుగుపెడతాను. జీవితం చాలా విలువైంది. ప్రతీ క్షణం అప్రమత్తంగా ఉండండి. రేపనేది ఉంటుందో లేదో తెలీదు. జాగ్రత్త సుమా" అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు. రష్మిక ప్రస్తుతం 'పుష్ప 2', 'కుబేర', 'గర్ల్‌ఫ్రెండ్' చిత్రాల్లో నటిస్తున్నారు.

అడ్వాన్స్ బుకింగ్స్‌లో దుమ్మురేపుతున్న దేవర



జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'. రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి కొరటాల శివ దర్శకత్వం వహిస్తుండగా, సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ ఇందులో కథానాయికగా నటిస్తుండగా, సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ఫస్ట్ సింగిల్ 'ఫియర్' సినిమాపై అంచనాలను తారాస్థాయిలో పెంచాయి. 'దేవర పార్ట్ 1' ఈ నెల 27న విడుదలవుతోంది. ఈ సినిమా రిలీజ్ కాకముందే బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తోంది. నార్త్ అమెరికాలో ఈ చిత్రం ప్రీమియర్ షో టిక్కెట్లు హాట్ కేకుల్లా అమ్ముడయిపోయాయి. ఇప్పటికే 8 లక్షల డాలర్లను (25 వేల టిక్కెట్లు) అడ్వాన్స్ బుకింగ్స్ రూపంలో వసూలు చేసి దుమ్మురేపుతోంది. 'దేవర' చిత్రం ట్రైలర్ ఈ రోజు విడుదల కానుంది.

ఇన్ ప్రోగ్రెస్

రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్ కలసి నిర్మించే 'కాంత' చిత్రం షూటింగ్ సోమవారం ఉదయం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ జంటగా నటించే ఈ సినిమాకు సెల్వమణి సెల్వరాజ్ దర్శకుడు. సముద్రఖని కీలక పాత్రధారి. రామానాయుడు



నాటి మద్రాసు నేపథ్యంలో కాంత

స్టూడియోలో తొలి క్లాప్ ఇచ్చి 'కాంత' చిత్రానికి శ్రీకారం చుట్టారు విక్టరీ వెంకటేశ్. 1950 నాటి మద్రాసు బ్యాక్‌డ్రాప్‌లో మానవ భాగోద్వేగాల లోతుల్ని ఆవిష్కరించే ఇతివృత్తంతో ఈ సినిమా రూపుదిద్దుకుంటుందని దర్శకుడు చెప్పారు. సురేశ్ ప్రొడక్షన్స్ సంస్థ 60వ సంవత్సరం సందర్భంగా స్పిరిట్ మీడియా కొత్త శకానికి నాంది పలుకుతూ తీస్తున్న సినిమా ఇదనీ రానా చెప్పారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదలయ్యే ఈ సినిమాను ప్రశాంత్ పొట్లూరి, రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ నిర్మిస్తున్నారు

విడిపోయిన జయం రవి దంపతులు



కోలీవుడ్ హీరో జయం రవి, ఆరతి జంట విడిపోయింది. తన భార్య ఆరతికి విడాకులు ఇస్తున్నట్లు జయం రవి ప్రకటించారు. 2009లో జయం రవి ఇరువైపు కుటుంబీకుల అంగీకారంతో ఆరతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరి వైవాహిక జీవితం 15 ఏళ్లపాటు సాఫీగా కొనసాగింది. కొద్ది నెలలకు ముందు ఇరువురి మధ్య మనస్పర్థలు ఏర్పడటంతో విడిపోయారు. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం జయం రవి తన విడాకుల విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. సినిమాల్లోనూ, నిజజీవితంలోనూ తాను ఎల్లప్పుడు పారదర్శకంగానే ఉంటానని, ఎలాంటి దాపరికాలకు తావులేదని భారమైన హృదయంతో ఓ చేదు విషయాన్ని చెప్పదలిచానని పేర్కొంటూ ఆరతితో వైవాహిక జీవితానికి స్వస్తి పలకాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తొందరపడి ఈ నిర్ణయం తీసుకోలేదని, ఆచితూచి, తనవారి సంక్షేమం దృష్ట్యా తీసుకున్న నిర్ణయమని జయం రవి తెలిపారు.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)



మెరుపై వచ్చిండే..

'జై భీమ్' ఫేమ్ టి.జె.జ్ఞానవేల్ రాజా దర్శకత్వంలో రజనీకాంత్ నటిస్తున్న చిత్రం 'వేట్టయాన్' (వేటగాడు). అమితాబ్ బచ్చన్, రానా దగ్గుబాటి, ఫహాద్ ఫాజిల్, మంజు వారియర్, రితికా సింగ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇందులో ఓ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో రజనీ కనిపించనున్నారు. ఈ సినిమా దసరా కానుకగా అక్టోబరు 10న ప్రేక్షకులను పలకరించనుంది. సోమవారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'మనసిలాయో'ను మేకర్స్ విడుదల చేశారు. 'మెరుపై వచ్చిండే.. మడత పెట్టి వచ్చిండే.. మనసు పెట్టి వచ్చిండే' అంటూ సాగే ఈ హుషారైన మాస్ గీతంలో రజనీ సరసన మంజూ వారియర్ ఆడిపాడారు. అనిరుధ్ సంగీతం అందించిన ఈ పాటకు శ్రీనివాస మౌళి లిరిక్స్ అందించారు. నకాశ్ ఆజీజ్, అరుణ్ కౌండిన్య, దీప్తి సురేశ్ ఆలపించారు.

దసరాకి వస్తున్నాం



సుహాస్, సంగీర్తన జంటగా దిల్ రాజు ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించిన 'జనక అయితే గనక' చిత్రం కొత్త రిలీజ్ డేట్ ప్రకటించారు. దసరా సందర్భంగా అక్టోబరు 12న విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. సందీప్‌రెడ్డి దర్శకుడు. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. ఈ సందర్భంగా ఇంట్రెస్టింగ్ వీడియో విడుదల చేశారు. ఈ సినిమా ఓవర్‌సీస్ హక్కులు సొంతం చేసుకున్న సుహాస్‌కి అందరూ ఫోన్ చేసి రిలీజ్ ఎప్పుడు అని అడుగుతుంటారు. ఈ గోల భరించలేక సుహాస్ దిల్ రాజుకు ఫోన్ చేసి రిలీజ్ డేట్ గురించి అడగడం, 'మనది ఫ్యామిలీ ఆడియన్స్‌కు కనెక్ట్ అయ్యే సినిమా కనుక దసరా సందర్భంగా అక్టోబర్ 12న విడుదల చేస్తున్నాం' అని చెప్పడం .. ఇలా ఆసక్తికరంగా ఆ వీడియో రూపొందించారు.

అన్ని ఎలిమెంట్స్‌తో నిండిన చిత్రం



'క్రేజీ బాయ్' ఫేమ్ దిలీప్‌ప్రకాశ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఉత్సవం'. ప్రకాశ్‌రాజ్, రాజేంద్రప్రసాద్, నాజర్, రెజీన కసాండ్ర కీలక పాత్రలు పోషించారు. అర్జున్ సాయి దర్శకత్వంలో సురేశ్ పాటిల్ నిర్మించారు. ఈ నెల 13న సినిమా విడుదలవుతున్న సందర్భంగా దిలీప్ మీడియాతో ముచ్చటించారు.

"ఇది ఎంతో ఉన్నతమైన కథాంశంతో తెరకెక్కిన చిత్రం. ఇందులో కథనే హీరో. రంగస్థల కళాకారుల జీవితాలతో ముడిపడిన చిత్రమిది. ఎంతో అనుభవమున్న నటులు ఇందులో నటించారు. మంచి సందేశం, ప్రేమ కథ, వినోదంతో పాటు ప్రేక్షకులు కోరుకునే అన్ని రకాల ఎలిమెంట్స్‌తో నిండిన చిత్రమిది. అనూప్ రూబెన్స్ అద్భుతమైన సంగీతం ఇచ్చారు. ఈ సినిమాకు బ్రహ్మ కడలి అందించిన ఆర్ట్ వర్క్ ప్రత్యేకాకర్షణ. నాకు యాక్షన్ సినిమాలంటే ఇష్టం. నా నెక్ట్స్ సినిమా అదే తరహాలో ఉండబోతోంది'.

నా ఇంటి పేరు అది కాదు



నటిగా సెలక్టివ్ పాత్రలు ఎంచుకుని తన నటనతో అందరినీ ఫిదా చేస్తుంటారు నిత్యామేనన్. ఇటీవలే మీడియాతో ముచ్చటించిన ఆమె.. అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసే ఓ విషయాన్ని పంచుకున్నారు. "చాలా మంది నా ఇంటి పేరు మేనన్. నా స్వస్థలం కేరళ అనుకుంటారు. నిజానికి నా ఇంటి పేరు మేనన్ కాదు. నా పేరు ఎస్.ఎస్.నిత్య. ఎన్ అంటే మా అమ్మ నళిని. ఎస్ అంటే మా నాన్న సుకుమార్. మాది బెంగుళూరు. మా కుటుంబం మూడు తరాలుగా బెంగుళూరులోనే ఉంటోంది. మేమంతా ఇంటి పేరును గోప్యంగా ఉంచడానికి ఇష్టపడతాం. మా కులమిదని చెప్పుకోవడం కూడా మాకు ఇష్టం ఉండదు. కేవలం న్యూమరాలజీ ఆధారంగా నా పేరు తర్వాత 'మేనన్' జతచేసుకున్నాను" అని చెప్పారు.

డబుల్ థ్రిల్‌తో...



శ్రీసింహ కోడూరి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'మత్తు వదలరా 2'. ఇది 2019లో విడుదలై సూపర్ సక్సెస్ సాధించిన 'మత్తు వదలరా' సినిమాకు రెండో భాగం. ఈ నెల 13న సినిమా విడుదలవుతున్న సందర్భంగా శ్రీసింహ మీడియాతో మాట్లాడారు.

"మొదటి భాగంతో పోల్చితే ఇందులో చాలా మార్పులు జరిగాయి. రెండో భాగం ఒక డిఫరెంట్ థ్రిల్లర్‌గా ఎన్నో ట్విస్టులు, సర్‌ప్రైజ్‌లతో అలరిస్తుంది. ఇందులో నేను, సత్య పోషించిన పాత్రలు డెలివరీ బాయ్స్ నుంచి స్పెషల్ ఏజెంట్స్‌గా మారే క్రమం ఆసక్తికరంగా ఉంటుంది. దర్శకుడు రితేష్ రాణాకు ఫిల్మ్ మేకింగ్‌లో చాలా అవగాహన ఉంది. ప్రతీ విషయంలో క్లారిటీగా ఉంటారు. ఫరియా అబ్దుల్లా తనకు సరిపోయే పాత్రను ఇందులో పోషించారు. ఆమె ఓ పాట పాడటమే కాకుండా కొరియోగ్రఫీ కూడా అందించారు. ఈ సినిమా మొదటి భాగం కంటే డబుల్ థ్రిల్‌ను పంచుతుంది. ఈ మూవీ ఫ్రాంచైజీని కొనసాగించే ఆలోచనల్లో ఉన్నాం" అని చెప్పారు.

మధ్యతరగతి మందహాసం



సుధీర్‌బాబు నటిస్తున్న తాజా చిత్రం 'మా నాన్న సూపర్ హీరో'. అభిలాష్‌రెడ్డి కంకర దర్శకత్వంలో సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. దసరాకి ఈ సినిమా విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదల చేశారు. మధ్యతరగతి యువకుడి పాత్ర పోషిస్తున్న సుధీర్‌బాబు స్కూటర్ నడుపుతూ చిరునవ్వుతో స్కూల్ పిల్లలను పలకరిస్తూ కనిపించారు. ప్రేమ, అనుబంధాలకు అర్థం చెప్పే సినిమా ఇదని దర్శకుడు చెప్పారు. ఈ నెల 12న టీజర్ విడుదల చేస్తున్నట్లు నిర్మాత తెలిపారు. ఆర్ణ ఈ సినిమాలో కథానాయిక.

జాతకం పూర్తి



ప్రియదర్శి, రూప కొడువాయూర్ జంటగా రూపొందుతున్న 'సారంగపాణి జాతకం' షూటింగ్ పార్ట్ పూర్తయింది. మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శివలెంక కృష్ణప్రసాద్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఆయన మాట్లాడుతూ 'నాకు ఎప్పటినుంచో పూర్తి వినోదాత్మక సినిమా తీయాలనే కోరిక ఉంది. జంధ్యాలగారితో ఓ కామెడీ ఫిల్మ్ తీయాలనుకున్నాను కానీ కుదరలేదు. ఆ కోరిక ఇప్పుడు 'సారంగపాణి జాతకం' సినిమాతో తీరుతోంది. మనిషి భవిష్యత్ అతని చేతి రేఖల్లో ఉంటుందా, లేక అతని చేసే చేతల్లో ఉంటుందా అని ప్రశ్నకు జవాబు ఇచ్చే పూర్తి హాస్య రస చిత్రం ఇది. మా సంస్థలో రెండు విజయవంతమైన సినిమాలు చేసిన మోహనకృష్ణ వినోదభరితంగా చిత్రాన్ని తీర్చిదిద్దారు. ఖర్చు పరంగా, టెక్నికల్ పరంగానూ ఎక్కడా రాజీ పడకుండా ఈ సినిమా చేస్తున్నాం' అని చెప్పారు

యూత్, ఫ్యామిలీ ఆడియన్సే టార్గెట్



చంద్రహాస్ హీరోగా నటిస్తున్న 'రామ్‌నగర్ బన్నీ' చిత్రం ఫస్ట్ లుక్, గ్లింప్స్ విడుదల చేశారు. విస్మయశ్రీ, రిచా జోషి, అంబికా వాణి, రీతూ మంత్ర హీరోయిన్లుగా నటిస్తున్నారు. శ్రీనివాస్ మహత్ (వెలిగొండ శ్రీనివాస్) దర్శకత్వంలో మలయజ ప్రభాకర్, పొడకండ ప్రభాకర్ నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు వరద బాధితుల సహాయార్థం తన వంతు ఆర్థిక సహాయాన్ని చంద్రహాస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రహాస్ మాట్లాడుతూ 'ప్రేక్షకుల్ని ఎంటర్‌టైన్ చేయాలని హీరోగా మారాను. ప్రస్తుతం మూడు సినిమాల్లో నటిస్తున్నాను. వాటిల్లో ఫస్ట్ మూవీ 'రామ్‌నగర్ బన్నీ'. అక్టోబరులో విడుదలవుతుంది. యూత్, ఫ్యామిలీ ఆడియన్స్‌కు నచ్చే సినిమా అవుతుంది' అని చెప్పారు.

సినిమాగా యండమూరి అంతర్ముఖం



ప్రముఖ రచయిత, దర్శకుడు యండమూరి వీరేంద్రనాథ్ రాసిన నవలల్లో అగ్ర తాంబూలం అందుకొన్న 'అంతర్ముఖం' నవల ఇప్పుడు సినిమాగా రూపొందనుంది. భీమవరం టాకీసు పతాకంపై 117వ చిత్రంగా ఇది రూపొందుతుందని నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ చెప్పారు. యండమూరి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తారని ఆయన తెలిపారు. సీనియర్ ఛాయాగ్రాహకుడు మీర్ ఈ సినిమాకు పని చేస్తున్నారు. అలాగే అల్లాణి శ్రీధర్, నరసింహ నంది దర్శకత్వంలో రెండు సినిమాలు కూడా తీసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని రామసత్యనారాయణ చెప్పారు.

మలయాళ హక్కులు కొన్నారు



కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న భారీ పీరియాడికల్ థ్రిల్లర్ 'క' చిత్రం మలయాళ థియేట్రికల్ రైట్స్ హీరో దుల్కర్ సల్మాన్‌కు చెందిన వేఫరర్ ఫిల్మ్స్ సంస్థ సొంతం చేసుకుంది. ఈ సినిమా ఫస్ట్ లుక్, టీజర్ చూసి దుల్కర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. 'క' తెలుగు హక్కుల్ని నిర్మాత వంశీ నందిపాటి ఇప్పటికే పొందారు. నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

● నీటమునిగిన పంటలను పరిశీలించిన ఎమ్మెల్యేలు, అధికారులు


సంతకవిటి: రామారాయపురం పంచాయతీలో ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు, కలెక్టర్ అంబేడ్కర్


తెర్లాం: నందిగాంలో పరిశీలిస్తున్న బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన


విజయనగరం రూరల్: వినాయకనగర్‌లో బురద చేరిన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యేలు హామీ ఇచ్చారు. సోమవారం జిల్లాలో పలుచోట్ల దెబ్బతిన్న పంటలను ప్రజాప్రతినిధులతోపాటు, కలెక్టర్, పలువురు అధికారులు పరిశీలించారు.

సంతకవిటి: కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు. సోమవారం సంతకవిటి మండలం రామారాయపురం పంచాయతీలో ముంపునకు గురైన పంటలను కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్‌తో కలిసి పరిశీలించారు. రామారాయపురానికి ప్రతి ఏటా తుఫాన్ వల్ల పంటనష్టం జరుగుతున్నవిషయం తన దృష్టికి వచ్చిందని,భవిష్యత్ ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు రూ.ఎనిమిది కోట్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ హామీఇచ్చారు. అంచనాలు తయారు చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో ఆర్డీవో సావిత్రి, మండల ప్రత్యేకా ధికారి సుధాకర్ తహసీల్దార్ కళ్యాణచక్రవర్తి, టీడీపీ నాయకులు కొళ్ల అప్పలనాయుడు, గట్టు భాను, గురవాన నారాయణరావు, వల్లూరు గణేష్, వంగా వెంకటరావు పాల్గొన్నారు.

● **రేగిడి:** రేగిడిలో వరదసమస్య, ప్రభుత్వకార్యాలయాల జలదిగ్బంధం సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్లి వరద నియంత్రణకు చర్య లు తీసుకుంటామని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు. రేగిడి, సంకిలి వద్ద సాయిన్నచానల్, బొడ్డవలస వద్ద నాగావళి నదీతీర ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ ఎల్లారావు, ఎంపీడీవో శ్యామలాకుమారి, టీడీపీ నాయకులు కోండ్రు జగదీష్, దూబ ధర్మారావు, కిమిడి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

●**తెర్లాం:**మండలంలోని నందిగాంలోకి నీరురావడంతో ఎమ్మెల్యే బేబీనాయన నీటిపారుదలశాఖ ఏఈ హరితోకలిసి పరిశీలించారు. లక్ష్మంనాయుడు చెరువు నిండిన తర్వాత మిగులు జలాలు చౌదరి ట్యాంకుకు వెళ్లే క్రమంలో పైపు కల్వర్టులు వద్ద నీరు నిల్వ ఉండిపోవడంతో రోడ్డుపై నుంచి కాలువల ద్వారా గ్రామంలోకి వస్తుందని అధికారులు తెలిపారు.కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో, మాజీ సర్పంచ్ ఆర్నెపల్లి సత్యం నంగిరెడ్డి రమణ పాల్గొన్నారు.

●**విజయనగరం రూరల్:** విజయనగరంలో వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాల్లో టీడీపీ శ్రేణులతె కలిసి ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పరిశీలించారు. ట్యాంకుబండ్ రోడ్డు, 31 వ డివిజన్ నగర్ కాలనీలోని పద్మావతినగర్, 44వ డివిజన్ పరిధిలోని అయ్యన్నపేట రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కూడా పలు ప్రాంతాలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. వినాయకనగర్‌లో సమస్యలు తెలుసుకున్నారు.

●**చీపురుపల్లి:** వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కళా వెంకటరావు ఆదేశించారు. జి. ములగాంలోని పెద్ద చెరువును పరిశీలించారు.భారీ వర్షాలకు ఈ చెరువు శనివారం సాయంత్రానికి పూర్తిగా నిండిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.దీన్నిదృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే కళావెంకటరావు చెరువును పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ఆయన వెంట పార్టీ నాయకులు రౌతు కామునాయుడు, గడే సన్యాసప్పలనాయుడు, గంట్యాడ సత్యనారాయణ, బెవర పురుషోత్తమనాయుడు, ఆరతి సాహు ఉన్నారు.


చీపురుపల్లి: జి.ములగాం పెద్ద చెరువు గట్టు పరిశీలిస్తున్న కళా

చికిత్స పొందుతూ మహిళ మృతి

కొత్తవలస: కొత్తవలస రైల్వేస్టేషన్ సమీపంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. కొత్తవలస ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో నివాసముంటున్న యాండ్రపు దేముడమ్మ(55) రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం రోడ్డుపై పడి గాయపడడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. గుర్తుతెలియని వాహనం ఢీకొని గాయపడినట్లు ఆసుపత్రివర్గాలకు సమాచారం ఇచ్చినట్లు సీఐ షణ్ముఖరావు తెలిపారు. కాగా స్థానికులు రోడ్డుపై పడిపోవడం వల్ల గాయపడిందని చెబుతున్నారని చెప్పారు. గుర్తుతెలియని వాహనం ఢీకొని గాయపడిందా, రోడ్డుపై పడిపోయి గాయపడిందా అన్న విషయంపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దేముడమ మృతిచెందినట్లు కేజీహెచ్ నుంచి సమాచారం రావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నామని చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు..

రణస్థలం: పైడిభీమవరం మద్యం దుకాణం సమీపంలో గల కాలువ వద్ద కె.బంగారప్పడు (25) సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు...విజయనగరం జిల్లా బొండపల్లి మండలం ఒంపల్లి గ్రామానికి చెందిన బంగారప్పడు పైడిభీమవరంలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. మూడు రోజులుగా బంగారప్పడు ఇంటికి వెళ్లకుండా మద్యం మత్తులో తిరుగుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున కాలువ వద్ద మృతి చెంది ఉన్నాడు. బంగారప్పడు ఒంటిపై గాయలు ఉన్నాయి. తన తమ్ముడును గుర్తుతెలియని వ్యక్తులు చంపి మద్యం దుకాణం వద్ద పడేశారని అతడి అక్క గంగ కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. ఘటనా స్థలానికి క్లూస్ టీమ్, జేఆర్‌పురం సీఐ అవతారం, ఎస్ఐ చిరంజీవి చేరుకొని మృతదేహాన్ని పరిశీంచారు. పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. బంగారప్పడు అక్క గంగ ఫిర్యాదు మేరకు జేఆర్ పురం ఎస్ఐ చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండున్నర కిలోల గంజాయి స్వాధీనం

బొండపల్లి: మండలంలోని గొట్లాం రైల్వేస్టేషన్ దగ్గర సోమవారం నలుగురు వ్యక్తుల నుంచి రెండున్నర కేజీల గంజాయిని బొండపల్లి ఎస్ఐ యు.మహేష్ స్వాధీనం చేసుకొని, వారిని అరెస్టుచేసినట్లు బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం బొండపల్లి పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్ఐ యు.మహేష్ ఇచ్చిన సమాచారం మేరకు గొట్లాం రైల్వేస్టేషన్ దగ్గర విజయనగరానికి చెందిన ఫణీంద్రపట్నాయక్, అల్లు సాగర్, సరోజ్, పటేల్ నుంచి రెండున్నర కేజీల గంజాయి, కత్తి, రెండు మొబైళ్లు, రూ.ఆరు వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సరోజ్ పటేల్‌ది ఒడిశాలోని మునిగుడ అని తెలిపారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నామని చెప్పారు. గంజాయి స్వాధీనంలో కీలకంగా వ్యవహరించిన ఎస్ఐ యు.మహేష్, సిబ్బంది అప్పలనాయుడు, రవి, చంద్రశేఖర్, రమణలను ఎస్పీ అభినందించారని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో గజపతినగరం సీఐ జీఏవీ రమణ పాల్గొన్నారు.

బొడ్డవర చెక్‌పోస్టు వద్ద కేజీ గంజాయి..

శృంగవరపుకోట : మండలంలోని బొడ్డవర చెక్‌పోస్టు వద్ద సోమవారం కేజీ గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నారాయణమూర్తి తెలిపారు.చత్తీస్‌గఢ్ లోని దంతరీ జిల్లా పడంపూర్‌కు చెందిన హరీష్‌కుమార్‌నిషాద్ గంజాయి తీసుకెళ్తుండగా ఎస్ఐ గంగరాజు సిబ్బందితో కలిసి నిర్వహిస్తున్న తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదుచేసినట్లు చెప్పారు.

బాడంగిలో వాహనాల తనిఖీలు

బాడంగి: బాడంగి ఎత్తుఖానా వద్ద పోలీసులు గంజాయి రవాణా నిరోధానికి ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. సోమవారం ఒడిశా నుంచి వచ్చిన ప్రతి వాహనాన్ని తనిఖీలు తర్వాతే విడిచిపెట్టారు. ఎస్ఐ తారకేశ్వరరావు రెండు గ్రూపులుగా ఉదయం ఆకులకట్ట వద్ద, మధ్యాహ్నం ఎత్తుబ్రిడ్జి వద్ద తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో ఏఎస్ఐ కొండలరావు, సిబ్బంది ఉన్నారు.

బొబ్బిలిలో నేలకొరిగిన చెట్టు


బొబ్బిలిలో నేలకొరిగిన తుమ్మచెట్టు

బొబ్బిలి: బొబ్బిలిలోని బలిజిపేటకు వెళ్లే రోడ్డులో యుద్ధ స్తంభం వద్ద తుమ్మ చెట్టు సోమవారం నేలకొరిగింది. ఆ సమయంలో గొల్లవీధికి చెందిన సాయికిరణ్ ద్విచక్ర వాహనంపై వస్తుండగా చెట్టు కూలింది. కాగా ఆయన త్రుటిలోప్రమాదం నుంచి తప్పించుకున్నాడు.అయితే ద్విచక్రవాహనం చెట్టు కింద చిక్కుకుపోవడంతో బయటకు తీశారు. రోడ్డుపై చెట్టుకూలడంతో బొబ్బిలి-బలిజిపేట రోడ్డులో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. కాగా చెట్టు సుమారు 60నుంచి 70 ఏళ్ల కిందటదని స్థానికులు చెబుతున్నారు. ఏఎస్ఐ భాస్కరరావు సిబ్బంది చెట్టుకొమ్మలను తొలగించి ట్రాఫిక్ క్లియర్‌చేశారు.

వర్షాలకు మూడు ఇళ్లు నేలమట్టం

విజయనగరం రూరల్:విజయనగరంలో వర్షాలకు మూడు ఇళ్లు నేలమట్టమయ్యాయి. రామకృష్ణనగర్‌లో ఇల్లు కూలడంతో ఒకరు గాయపడ్డారు.వీటి అగ్రహారం ప్రాంతంలో,36వ డివిజన్ మజ్జిపేటలో వర్షం వల్ల ఇల్లు కూలిపోయింది.

రావాడలో ఆవు మృతి

భోగాపురం: మండలంలో కురుస్తున్న వర్షాలకు ఓ ఆవు మృతి చెందగా.. 5 గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నట్టు అధికారులు సోమవారం తెలిపారు. రావాడకు చెందిన కొయ్య నరసయ్యకు చెందిన ఆవు ఆదివారం వర్షానికి వాగులో కొట్టుకుపోయింది. అదే గ్రామంలోని చెరువులో మృతి చెందినట్టు గుర్తించారు. దీని విలువ సుమారు రూ.35 వేలు ఉంటుందని పోలిపల్లి పశు వైద్యాధికారి కమల కుమారి తెలిపారు. అమటాం రాయవలస, దల్లిపేట, పోలిపల్లి, సవరవల్లి గ్రామాల్లో పూరిళ్లు, చెరుకుపల్లిలో పెంకుటిల్లు పాక్షికంగా దెబ్బతిన్నట్టు తహసీల్దార్ ఎం.సురేష్ తెలిపారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు: కమిషనర్

బొబ్బిలి: వర్షాల వల్ల వ్యాధులు ప్రబలకుండా, దోమల నివారణా చర్యలు చేపట్టాలని మునిసిపల్ కమిషనరు లాలం రామలక్ష్మి ఆదేశించారు. సోమవారం మునిసిపాలిటీలోని 14వ వార్డులోని చినచెరువుగట్టుపై నివాసముంటున్న పలు కుటుంబాల ఇళ్లను పరిశీలించారు. తాగునీరు, శానిటేషన్, వీధిదీపాలు తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. తాగునీటి శాంపిల్స్‌ను పరీక్షించారు. ఆమె వెంట టీపీఎస్ వరప్రసాద్, ఏఈ సురేష్ శానిటరీ ఇన్‌స్పెక్టరు మురళి తదితరులు ఉన్నారు.

పరిశ్రమలకు నిలిచిపోయిన నీటి సరఫరా

బొబ్బిలి: బొబ్బిలి ఏపీఐఐసీ గ్రోత్‌సెంటర్‌లో గల పరిశ్రమలకు వర్షాల వల్ల నీటిసరఫరా మూడు రోజులుగా నిలిచిపోయింది. వేగావతి నదిలో ఇన్‌ఫిల్ట్రేషన్ బావులు, పంప్‌హౌస్ వరదనీటి ప్రవాహంతో ముంపునకు గురికావడంతో నీటి పంపింగ్, సరఫరాకు అంతరాయం కలిగింది.తొలుత పంప్‌హౌస్ వద్దకు చేరుకోవడానికి సిబ్బంది ఇబ్బందిపడ్డారు. జోనల్ మేనేజరు మురళీమోహన్ ఆదేశాల మేరకు శ్రీకాకుళం జోనల్ కార్యాలయంలో గల ఇంజినీరింగ్ నిపుణుడు బడగల హరిధరరావును జేఈ రాజీవ్, ఇతర సిబ్బందిని పంపించారు. బురద దారిలో వెళ్లి అక్కడ మరమ్మతులు చేపట్టారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

కొత్తవలస: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుడి సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ కోటిబాబు తెలిపారు. తుమ్మికాపల్లి రైతులకు సర్పంచ్ విరోతి కొండలరావు ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం గురించి వివరించారు.

జమ్మాదేవిపేటలో వరలక్ష్మి దాంపత్య వ్రతం


రామదూత సేవలో ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేటలో రామదూత స్వామి ఆధ్వర్యంలో వరలక్ష్మి దాంపత్య వ్రత కలశ పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి దంపతులు రాం ప్రసాద్ కలశపూజలు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరెడ్ల ఈశ్వరరావు, విశాఖ బీసీ సెల్ అధ్యక్షుడు బొబ్బిలి అప్పారావు, మాజీ సర్పంచ్ ఈశ్వరరావు, రమణమూర్తి, విజయ్‌కుమార్, నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇసుక పాలసీ: కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్: పారదర్శకంగా ఇసుకపాలసీని అమలు చేస్తామని, సందేహాలు ఉంటే డిప్యూటీ కమిషనర్‌తో ఎప్పుడైనా మాట్లాడవచ్చని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. లారీ యాజమానులు ఉచిత ఇసుక సరఫరాలో ఇబ్బంది కలగకుండా చూడాలని జిల్లా అధికార యంత్రాంగం నుంచి అన్ని విధాలా సహకరిస్తామని చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో లారీ యాజమానులతో సమావేశం నిర్వహించి, ప్రభుత్వ పాలసీతో అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ ద్వారా వాహనాలను రిజిస్టర్ చేసుకోవాలని, ఇసుక కోసం కూడా వినియోగదారులు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జిల్లాలో ఇప్పటివరకూ 87 వాహనాల రిజిస్ట్రేషన్ జరిగిందని తెలిపారు. బొబ్బిలిలో 37 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని, అక్టోబరు రెండోతేదీన మరో రెండు స్టాక్ పాయింట్లలో 1.5లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులోకి రానుందని చెప్పారు. లారీలు ఇసుక కోసం గంటల తరబడి ఎదురుచూడాల్సిన అవసరం లేదని, ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోగానే, ట్యాగ్ చేసిన వాహనదారుడు మొబైల్ నెంబరుకు టైంస్లాట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. లారీ కెపాసిటీని అనుసరించి ధర నిర్ణయించనున్నట్లు చెప్పారు. గరిష్ఠంగా రోజుకు 20 టన్నుల వరకూ ఒక వ్యక్తికి అందజేస్తామని తెలిపారు. జిల్లాలో సరాసరి రోజుకు 950 మెట్రిక్ టన్నుటు బుకింగ్ జరుగుతుందన్నారు. శ్రీకాకుళం కలెక్టర్‌తో మాట్లాడి ఇసుక రీచ్‌ని ఏర్పాటు చేయాలని కలెక్టరు అంబేడర్‌కు లారీ యాజమానులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రవాణాశాఖ ఉప కమిషనర్ మణికుమార్, మైన్స్ డీడీ సూర్యచంద్రరావు, ఎంవీఐలు రమణ, దుర్గాప్రసాద్, రవిశంకర్ పాల్గొన్నారు.

24 గంటలూ పోలీసు సేవలు: ఎస్పీ

విజయనగరం క్రైం: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసుశాఖను అప్రమత్తం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి 24 గంటలు సేవలందించనున్నట్లు పేర్కొన్నారు. సహాయం కోసం పోలీసు కంట్రోల్ రూంలో 08922-224455, 91211 09483 నెంబర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. తుఫాన్ ప్రభావం జిల్లాకు తీవ్రంగా ఉండవచ్చని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు, నదీ పరివాహక ప్రాంతాల్లో నివసించే వారు పోలీసులు సాయం పొందేందుకు నెంబర్లను అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న వివేక్ ఆనంద్ శ్రీనివాస్

రాజాం రూరల్: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 14న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ న్యాయాధికారి వివేక్ ఆనంద్ శ్రీనివాస్ కోరారు.సోమవారం రాజాంకోర్టు ప్రాంగణంలో జూనియర్ సివిల్ న్యాయాధికారి కృష్ణసాయితేజతో కలిసి నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల పోలీసులు, ఎక్సైజ్‌సిబ్బంది, న్యాయవాదులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ సూర్యకుమార్, రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్, ఎక్సైజ్ సీఐ శ్రీధర్, ఎస్ఐ చంద్రశేఖర్, రేగిడి, సంతకవిటి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కూరగాయల పంటలకు అపార నష్టం

రామభద్రపురం: మండలంలో కురుస్తున్న వర్షాలకు కూరగాయల పంటలకు అపారనష్టం వాటిల్లింది. కూరగాయల పంటల సాగులో జిల్లాలోనే రామభద్రపురం మండలం మొదటిస్థానంలో ఉన్న విషయం విదితమే. ఇక్కడ అన్నిరకాల కూరగాయలు రైతులు సాగుచేస్తున్నారు. కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తుండడంతో కూరగాయల పాదుల్లో నీరు నిలిచిపోవడంతో పంటలు నాశనమయ్యాయని ఆరికతోటకు చెందిన రైతు మామిడి నారాయణ వాపోయాడు. మండలంలోనే సోంపురం, మత్రివలస, చింతలవలస, తారాపురం, రామభద్రపురం, నర్సాపురం,కొత్తరేగ, పాతరేగ, దుప్పలపూడి గ్రామాల రైతులు కూరగాయల పంటల సాగుతోనే జీవనం సాగిస్తున్నారు.వర్షాకాలంలోఏటా ఈ సమస్య తలెత్తుతోందని రైతులు వాపోతున్నారు.ప్రభుత్వం స్పందించి పాడైన పంటలకు నష్టపరిహారం అందించాలని పలువురు రైతుల కోరుతున్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

బాడంగి: విద్యార్థులకు సెలవులు తప్ప విద్యాశాఖాధికారులకు కాదని సీపీఎం నాయకుడు సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం విద్యాశాఖాధికారులు మధ్యాహ్నంఒకటిన్నర గంటలకే బాడంగి ఎమ్మార్సీకి తాళంవేసినా విద్యాశాఖ ఉన్నతాధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. తక్షణమే కలెక్టర్ అధికారులపై చర్యలు తీసుకోకపోతే కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని పేర్కొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

బొబ్బిలి: స్థానిక బాలికల వసతిగృహంలో సోమవారం విద్యార్థులకు ఎయిడ్స్, ఇతర సుఖవ్యాధులపై స్వచ్ఛంద కార్యకర్త ఉమ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఎయిడ్స్‌సోకిన వారిపట్ల వివక్ష చూపరాదని, ఎవరైనా వారిని హేళనచేస్తే పోలీసు కేసు పెడతామని తెలిపారు. ఎటువంటి సమస్యలు ఎదురైనా 1097 టోల్‌ఫ్రీ నెంబరుకు కాల్‌చేసి సమాచారం ఇస్తే అధికారులు దర్యాప్తుజరిపి చర్యలు తీసుకుంటారని చెప్పారు.

ఆర్వోబీలో నీరు తొలగింపు

లక్కవరపుకోట: మండలంలో సోంపురం రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీటిని సోమవారం అధికారులు తొలగించారు.ఆదివారం కురిసిన భారీ వర్షాలకు రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీరు నిండిపోయి వేపాడ వెళ్లేందుకు మార్గం లేకుండాపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సోమవారం విషయం తెలుసుకున్న మండల ప్రత్యేకాధికారి ప్రేమకుమార్ ఆధ్వర్యంలో తహసీల్దార్ ప్రసాదరావు, ఎంపీడీవో రూపేష్, ఎస్ఐ గోపాలరావులు రైల్వే సిబ్బందితో చర్చించి వాటర్ ఇంజిన్లు రప్పించి నీటిని తోడించారు.

గ్రంథాలయానికి ఇన్వర్టర్ వితరణ

శృంగవరపుకోట: శృంగవరపుకోట శాఖా గ్రంథాలయానికి సోమవారం వైద్యుడు ఆర్.త్రినాథరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ రేవతి, రైల్వే ఉద్యోగి చిప్పాడ ఈశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కోన దేవిలు ఆర్థిక సహకారంతో ఇన్వర్టర్ అందజేశారు. వీరికి శాఖా గ్రంథాలయాధికారి దామోదర్ శ్రీధర్ అభినందించారు.

రాచ్చెరువు పరిశీలన

శృంగవరపుకోట: శృంగవరపుకోట రాచ్చెరువును సోమవారం ప్రత్యేక అధికారి మురళీ కృష్ణ తహసీల్దార్ ఎం.అరుణకుమారి పరిశీలించారు. శనివారం రాత్రి నుంచి కురిసిన వర్షాలకు రాచ్చెరువు గట్టు గండిపడే అవకాశంఉన్నట్లు గుర్తించిన రెవెన్యూఅధికారులు అప్రమత్తమయ్యారు. చెరువులో నీరు ఎక్కువగా ఉండడంతో గండిపడే అవకాశమున్నచోట పూడ్చేందుకు ఇబ్బందిపడ్డారు.విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. ఆ సమయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలను రప్పించారు. మాజీ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు కూడా అక్కడకు వచ్చారు. అందరూ కలిసి రాతి బుగ్గి, ఇసుక బస్తాలతో చెరువు గండిపడకుండా కప్పారు.

డీజేలు ఏర్పాటు చేస్తే చర్యలు: సీఐ

కొత్తవలస: వినాయక మండపాల్లో అనుమతి లేకుండా మైక్‌సెట్లు, డీజేలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని కొత్తవలస సీఐ షణ్ముఖరావు హెచ్చరించారు. సోమవారం కొత్తవలసలో మైక్‌సెట్లు, డీజేల యజమానులతో మాట్లాడారు.

పంటల పరిస్థితి తెలియజేయాలి: ఏవో

బాడంగి: వర్షాలకు సిబ్బంది క్షేత్ర పరిశీలించి పంటల పరిస్థితి ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఏవో కె.శిరీష తెలిపారు. బాడంగిలో ఏవోతోపాటు మరడాన సత్యం, శంకరరావు, కోరుపల్లి అప్పలస్వామి పొలాల్లో వర్షానికి నీటి మునిగిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. వారివెంట వీఏఏ జయలక్ష్మి ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో విద్యా గణపతి పూజలు


కొత్తవలస: విద్యాగణపతి పూజల్లో పాల్గొన్న విద్యార్థులు

కొత్తవలస: కొత్తవలసలోని వసంత్ విహార్‌లో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి విద్యాగణపతి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 500 మంది విద్యార్థులకు పారిశ్రామికవేత్త వల్లూరి జయప్రకాష్‌బాబు పుస్తకాలను అందజేశారు.వేదపండితుడు అంపో ఉమామహేశ్వర శర్మ విద్యా గణపతికి పూజలను చేయించారు. సోమ వారం సామూహిక రుద్రాభిషేకాలను నిర్వహించారు.

గణనాథుల నిమజ్జనం

విజయనగరం రూరల్: విజయనగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన గణనాథులను మూడోరోజు సోమవారం నిమజ్జనం చేశారు. సోమవారం వర్షం తెరిపివ్వడంతో ఉత్సవ నిర్వాహకులు నిమజ్జనోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఊరేగింపు నిర్వహించి అయ్యన్నకోనేరు తదితర చెరువుల్లో నిమజ్జనం చేశారు.

దిబ్బగుడ్డివలసలో సామాజిక తనిఖీ

బొబ్బిలి రూరల్: మండలంలోని దిబ్బగుడ్డివలసలో సోమవారం సర్పంచ్ చింతల రామారావు అధ్యక్షతన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామంలో జరిగిన వివిధ పనులను సభలో డీఆర్పీ చదివి వినిపించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యు.వెంకటనాయుడు పాల్గొన్నారు.

13న బొబ్బిలి ప్రజావేదిక

బొబ్బిలిలో మంగళవారం జరగాల్సిన సామాజిక తనిఖీ ప్రజావేదిక తుఫాన్, అధిక వర్షాల వల్ల వాయిదా వేసినట్లు ఎంపీడీవో పి.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు 13వ తేదీన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అశోక్‌ను కలిసిన నెల్లిమర్ల ఎమ్మెల్యే

విజయనగరం రూరల్: టీడీపీ సీనియర్ నాయకుడు అశోక్ గజపతిరాజును నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి సోమవారం పార్టీ కార్యాలయంలో కలిశారు. రామతీర్థం దేవస్థానం అభివృద్ధి పనులు, రోడ్ల విస్తరణతో పాటు, చింతలవలస తదితర ప్రాంతాల్లో పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

వైద్య ఆరోగ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా వర్మ

విజయనగరం దాసన్నపేట: రాష్ట్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్య ఉద్యోగ సంఘం జిల్లా సంఘం అధ్యక్షుడిగా పూసపాటిరేగ మండలంలోని రెల్లివలస పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ టీవీఎస్ వర్మను ఎన్నుకున్నారు. కోశాధికారిగా జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయంలో ఆరోగ్య విభాగాధిపతి సాంబమూర్తి, అసోసియేషన్ అధ్యక్షుడిగా అప్పలనాయుడు,ఏడుగురు అసోసియేట్ అధ్యక్షులతో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.వర్మను ప్రభుత్వ వైద్య ఆరోగ్య కేంద్రాల ఉద్యోగులు అభినందించారు.

పారిశుధ్య పనులకు సిద్ధంకావాలి: ఎంపీడీవో

తెర్లాం: వరదలు తగ్గడంతో పారిశుధ్యపనులకు సిద్ధంకావాలని ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. తెర్లాంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుధ్యపనుల కోసం బ్లీచింగ్, క్లోరినేషన్, తదితర సామగ్రిని సిద్ధంగాఉంచుకోవాలన్నారు.కార్యక్రమంలో ఈవోపీఆర్డీ నీలిమ పాల్గొన్నారు.

● **జామి:** వర్షాల వల్ల గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై అధికారులు దృష్టిసారించాలని జనసేన నాయకుడు పోతల రాంబాబు కోరారు. సోమవారం అన్నంరాజుపేటలో చెత్త పేరుకుపోయిందని వాపోయారు.

కాజ్‌వేపై రాకపోకలు నిలిపివేయాలి

జామి: మండలంలోని భీమసింగి కాజ్‌వేపై రాకపోకలు నిలిపివేయాలని తహసీల్దార్ కృష్ణలత కోరారు. సోమవారం కాజ్‌వేను పరిశీలించారు. నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో రాకపోకలు సాగిస్తున్నవారిని ఆపి హెచ్చరించారు. ఎవరూ కాజ్‌వేపై నుంచి వెళ్లకుండా రెవెన్యూ ఉద్యోగులను కాపలా ఉంచారు.

ముంపు తగ్గే వరకూ పునరావాస కేంద్రం

శృంగవరపుకోట రూరల్ : మండలంలోని పోతనాపల్లి, సంతగైరమ్మ పేటకు చెందిన కుటుంబాలు ఇళ్ల వద్ద ముంపు తగ్గేవరకూ పునరావాస కేంద్రంలో ఉండాలని మండలప్రత్యేకాధికారి మురళీకృష్ణ సూచించారు. సోమవారం సంతగైరమ్మపేట పాఠశాలలో 20 కుటుంబాలకు పంచాయతీ కార్యదర్శి కె.లక్ష్మి, హెచ్ఎం బంగారునాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రం పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీవో శేషుబాబు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాలు

బొబ్బిలి: విజయవాడ వరద బాధితులకు పలువురు విరాళాలు అందజేస్తున్నారు. పట్టణానికి చెందిన మెప్మా సిబ్బంది రూ. 1,34,443 చెక్కును ఎమ్మెల్యే బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడులకుమునిసిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి సమక్షంలో సోమవారం అందజేశారు. మండలంలోని కారాడ గ్రామానికి చెందిన క్లౌడ్‌జెట్టా టెక్ ప్రైవేట్ లిమిటెడ్ సాఫ్ట్‌వేర్ సంస్థ డైరెక్టర్ పిల్లమూడి రామకృష్ణ రూ.లక్ష బొబ్బిలి కోటలో అందజేశారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ గోతులమయం


కాంప్లెక్స్‌లో ఏర్పడిన గొయ్యి

రాజాం: రాజాం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో రోడ్డు గోతులమయమయ్యింది. కాంప్లెక్స్‌ను ఆరు నెలల కిందట నిర్మించారు. గోతులుకావంతో బస్సులు లోపలికి, బయటకు వెళ్లే సమ యంలో డ్రైవర్లు ఇబ్బం దిపడుతు న్నారు. కాంప్లెక్స్‌లోకి వెళ్లేముందు భాగంలో పెద్దగొయ్యి ఏర్పడడంతో ప్రయాణికులు అగచాట్లకు గురవు తున్నారు. గోతులు పూడ్చాలని పలుసార్లు ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయిందని పలువురు వాపోతున్నారు.

పోడుపట్టాలు మంజూరు చేయండి


డీటీకి వినతిపత్రం అందజేస్తున్న కొండమల్లిపూడి గిరిజనులు

శృంగవరపుకోట: వెంకటరమణపేట శివారులో గల కొండమల్లిపూడి గ్రామానికి చెందిన గిరిజనులు పోడు పట్టాల మంజూరు చేయాలని కోరారు. ఎస్‌కోట డీటీ భరత్ కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. తాతాతండ్రుల నుంచి 16 కుటుంబాలు పోడు వ్యవసాయం చేసుకుంటున్నట్లు గిరిజన నాయకులు వివరించారు.

17న విశ్వకర్మ భగవాన్ జయంతి

రాజాం:రాజాంలోని కస్పావీధిలో ఈనెల17న కామాక్షీ విశ్వ బ్రాహ్మణ సొసైటీ ఆధ్వర్యంలో మద్దిరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతి 12వ వార్షికోత్సవం నిర్వహించనున్నారు. రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్‌కు టీడీపీ రాష్ట్ర విశ్వబ్రాహ్మ బీసీ సాధికారకమిటీ కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్షుడు ముగడ శ్రీనివాసరావు ఆహ్వానించారు.

రికార్డులపై ఆరా!

● గిరిజన ఇంజనీరింగ్ శాఖపై విజిలెన్స్

పార్వతీపురం, (ఆంధ్రజ్యోతి): 'గిరిజన ఇంజనీరింగ్ శాఖలో కలకలం' పేరిట సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం సర్వత్రా చర్చనీయాంశమైంది. అధికారులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తే.. మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందనే వ్యాఖ్యలు వినిపించాయి. మరో వైపు ఆ శాఖ ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అప్పట్లో కాంట్రాక్టర్ సమర్పించిన డాక్యుమెంట్లు సరిగ్గా పరిశీలించకపోయామని, ప్రస్తుతం తమ ఉద్యోగాలకు ముప్పు వచ్చే పరిస్థితి ఏర్పడిందని వారు వాపోతున్నారు. కాగా సోమవారం విజిలెన్స్ అధికారులు పార్వతీపురం ఐటీడీఏలో ఉన్న గిరిజన ఇంజనీరింగ్‌శాఖ కార్యాలయానికి చేరుకుని సమాచారాన్ని సేకరించినట్లు సమాచారం. పలు పనులకు సంబంధించిన రికార్డుల వివరాలను అడిగి తెలుసుకున్నట్లు తెలిసింది. ఆ శాఖలో సూపరింటెండెంట్ ఇంజనీర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి బిల్లులు పొందిన కాంట్రాక్టర్ కేసులో ఇప్పటికే సస్పెన్షన్‌కు గురైన ముగ్గురు ఇంజనీరింగ్ అధికారులతో పాటు మరో నలుగురు ఉద్యోగులపై త్వరలోనే క్రిమినల్ కేసులు నమోదయ్యే పరిస్థితి కనిపిస్తోంది. దీనిపై సీబీసీఐడీతో దర్యాప్తు చేయించాలని ఇప్పటికే ప్రభుత్వం ఆదేశించడంతో ఆ శాఖ ఉద్యోగులు ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ఇదిలా ఉండగా కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన సుమారు రూ.2 కోట్ల బిల్లులను పార్వతీపురం ఐటీడీఏ ద్వారా నిలిపివేసినట్లు తెలిసింది.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

● కలెక్టర్ శ్యాంప్రసాద్

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలకు సత్వరమే పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ ఆదేశించారు. సోమ వారం స్థానిక కలెక్టర్ కార్యాలయం నుంచి ఆయన జిల్లా, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజా ఫిర్యాదు అర్జీల పరిష్కారం, గణేష్ నిమజ్జన ఏర్పాట్లు, వర్షాలపై సమీక్షించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదులకు మొక్కుబడి సమాధానాలతో మూసివేయకుండా వాటికి సరైన పరిష్కారం చూపించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఉన్న అన్ని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాలను అక్టోబరు 2వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. గణేష్ నిమజ్జనాలపై తహసీల్దార్లు, పోలీసు అధికారులు పర్యవేక్షించాలన్నారు. గజ ఈతగాళ్లను సిద్ధం చేయాలని, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన చోట్ల ఎన్‌డీఆర్ఎఫ్ బృందాల సేవలను వినియోగించుకోవాలన్నారు. ఈ సమావేశంలో జేసీ శోభిక, డీఆర్వో జి.కేశవనాయుడు, డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు వై.సత్యం నాయుడు, కె.రామచంద్రరావు, జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్, జిల్లా మత్స్యశాఖాధికారి తిరుపతయ్య పాల్గొన్నారు.

రోగులకు అందుబాటులో ఉండాలి

పాలకొండ: వైద్యులు రోగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సూచించారు. ఎం.సింగుపురం పీహెచ్‌సీని ఆయన సోమవారం సందర్శించారు. తనిఖీ సమయంలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో అసంతృప్తి చెందారు. డీఎంహెచ్‌వోతో ఫోన్‌లో మాట్లాడారు. వైద్యులు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం రోగులతో మాట్లాడి అందుతున్న వైద్యసేవలపై అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి రికార్డులు పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యేతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఏకలవ్య విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి

సీతంపేట: మల్లి పీవీటీజీ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహిస్తున్న ఏకలవ్య పాఠశాల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో పీవో యశ్వంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. వర్షాకాలంలో పాఠశాల శ్లాబు కారిపోవడంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారని చెప్పారు. పాఠశాల కమిటీ చైర్మన్ సవర చిరంజీవి, మాజీ ఎంపీటీసీలు జయలక్ష్మి, బుగత పైడిరాజుతో పాటు సవర బాలరాజు పాల్గొన్నారు.

శాశ్వత పరిష్కారానికి చర్యలు

సీతంపేట: ఆంధ్రజ్యోతి దినపత్రికలో సోమవారం వెలువడిన 'ఏకలవ్య విద్యార్థులకు తప్పని అవస్థలు' అనే వార్తకు ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి స్పందించారు. మల్లి పీవీటీజీ గురుకుల రెసిడెన్షియ ల్ పాఠశాలలో నిర్వహిస్తున్న ఏకలవ్య అదనపు తరగతి గదులను ఆయన సోమవారం సందర్శించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భామిని ఏకలవ్య పాఠశాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులను అక్కడకు తరలించే ప్రక్రియను వేగవంతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తక్షణ పరిష్కారం కింద ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి దుస్థితిపై స్పందించారు


గోతులను పూడుస్తున్న దృశ్యం

గరుగుబిల్లి: ఉల్లిభద్ర ప్రధాన రహదారి దుస్థితిపై పోలీసు యంత్రాంగం స్పందించింది. గత కొద్ది రోజులుగా వర్షాలు కురవడంతో ఉల్లిభద్ర సమీపంలోని ఎర్రన్నగుడి సముదాయంలో భారీ స్థాయిలో గోతులు ఏర్పడ్డాయి. ఈ గోతుల్లో వర్షపు నీరు చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సోమవారం ఉల్లిభద్ర రోడ్డుపై గోతిలో భారీ వాహనం దిగబడింది. దీంతో గంటకు పైగా వాహనదారులు ఆ ప్రాంతంలోనే నిరీక్షించాల్సి వచ్చింది. ఎస్ఐ పి.రమేష్‌నాయుడు, సిబ్బంది ప్రత్యేక చొరవ చూపి గోతుల్లోని వర్షపునీటిని మళ్లించే ఏర్పాట్లు చేశారు. గోతుల్లో రాళ్లు, రాతి బుగ్గి వేసి, చదును చేయించారు. కొంతమేర సామగ్రిని టీడీపీ ప్రతినిధి మరడాన నారాయణస్వామితో పాటు స్థానికులు సమకూర్చారు.

ఖాళీ స్థలాలను బాగు చేయాలి

పాలకొండ: నగర పంచాయతీలోని పలు ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలను తొలగించి బాగు చేయాలని నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు ఆదేశించారు. సచివాలయాల ప్లానింగ్ సెక్రటరీలు, శానిటేషన్ సెక్రటరీలతో ఆయన సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఖాళీ స్థలాల యజమానులకు, కాలువలపై ఆక్రమిత కట్టడాలు నిర్మించిన వారికి నోటీసులు అందించాలన్నారు. నీటి ప్రవాహానికి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. చెరువు గట్లు, ఇరిగేషన్ కెనాల్స్ తదితర వాటిపై ఆక్రమణలను వెంటనే కూల్చివేయడానికి నోటీసులు అందించాలన్నారు. దురాక్రమణలు చేస్తే సహించేది లేదన్నారు.

వ్యాధులు ప్రబలకుండా దృష్టి సారించాలి

గరుగుబిల్లి: పంచాయతీల పరిధిలో వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్డీ ఎల్.గోపాలరావు సూచించారు. మండలంలోని పెదగుడబ, ఉద్దవోలు, చినగుడబ తదితర పంచాయతీలను వారు సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాల కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేపట్టాలని, పారిశుధ్య పులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి, వైరల్ జ్వరాలు ఉన్నట్లయితే తక్షణమే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వారు సూచించారు. విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పరిశీలనలో వైద్య సిబ్బంది రమేష్‌కుమార్, సచివాలయ సిబ్బంది ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

అత్యవసర పనులుంటేనే బయటకు రండి

ఒడిశా


మాట్లాడుతున్న కలెక్టర్ పారుల్ పట్వార్

రాయగడ: బంగాళాఖాతంలో నెలకొన్న అల్పపీడన ద్రోణి కారణంగా జిల్లాలో అత్యధిక మోతాదులో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జిల్లాను ఆరెంజ్ జోన్‌గా ప్రకటించింది. దీనిపై కలెక్టర్ పారుల్ పట్వార్ జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ సోమవారం ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని, నదీ పరివాహక ప్రజలను అప్రమత్తం చేసి, వారి రక్షణ కోసం అన్ని చర్యలు తీసుకోవాలని అన్ని విభాగాల అధికారులకు ఆదేశాలు జరీ చేశారు. ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పనులుంటే తప్ప బయటకు రావొద్దని సూచించారు. జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుందని, అన్ని అత్యవసర విభాగాలు, పీడబ్ల్యూ ఎమర్జెన్సీ, వైద్య 24 విభాగాల అధికారులను సిద్ధంగా ఉంచామని తెలిపారు. రానున్న 24 గంటల్లో అత్యధికంగా వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని, ప్రజలంతా చాలా జాగ్రత్తగా ఉండాలని కోరారు.

అప్రమత్తంగా ఉండాలి

● లోతట్టు ప్రాంతాలు, జలాశయాలను సందర్శించిన ప్రజాప్రతినిధులు, పోలీసులు, అధికారులు


లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ: అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సూచించారు. పాలకొండ డివిజన్ కేంద్రంలోని లోతట్టు కాలనీలను నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు, అధికారులు, కూటమి నాయకులతో కలిసి ఆయన సోమవారం సందర్శించారు. పట్టణంలోని గాయత్రీనగర్, పోతులగెడ్డ, గారమ్మకాలనీ, అన్నవరం ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ప్రస్తుతానికి ఎక్కడా ఇబ్బందులు లేవని, ఎక్కడ ఎవరు ఇబ్బందులకు గురైనా అధికారులకు, తనకు ఫోన్ ద్వారా తెలియజేయాలని సూచించారు. ఈ పరిశీలనలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్‌కుమార్, జనసేన ఉమ్మడి జిల్లాల ఉపాధ్యక్షుడు గర్భాణ సత్తిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు గండి రామినాయుడు, వార్డుకౌన్సిలర్ వెలమల మన్మథరావు, రౌతు సోంబాబు, వెన్నప శ్రీనివాసరావు, డొకర శ్రీనివాసరావు, రాంబాబు, హనుమంతు తమ్మారావు, కడగల వెంకటరమణ, భాసూరు కాంతారావు, ఇరిగేషన్ అధికారులు, సీఐ ఎం.చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

జంపరకోట జలాశయం పరిశీలన

మండలంలోని జంపరకోట జలాశయాన్ని ఎమ్మెల్యే జయకృష్ణ, ఇంజినీరింగ్ అధికారులు, కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. జలాశయానికి సంబంధించిన పూర్తి వివరాలను ఇంజినీరింగ్ సిబ్బందికి అడిగి తెలుసుకున్నారు. అనంతరం జంపరకోటలోని సచివాలయం, వివిధ ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించారు. జంపరకోట జలాశయ పునరుద్ధరణకు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించాలని ఆదేశించారు. ఈ సందర్భంలో టీడీపీ నాయకులు గండి రామినాయుడు, జీలకర్ర మోహన్‌రావు, కృష్ణ, పొట్టి శ్రీనివాసరావు, తడేలు గణేష్, రమేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వట్టిగెడ్డను సందర్శించిన ఎల్విన్‌పేట సీఐ


వట్టిగెడ్డ రిజర్వాయర్ వద్ద పరిశీలిస్తున్న సీఐ

జియ్యమ్మవలస: తాళ్లదుమ్మ పంచాయతీ రావాడ గ్రామం వద్ద ఉన్న వట్టిగెడ్డ రిజర్వాయర్‌ను ఎల్విన్‌పేట సీఐ హరిబాబు, ఇన్‌చార్జి ఎస్ఐ పి.అనీష్ సోమవారం పరిశీలించారు. ప్రస్తుతం వట్టిగెడ్డ రిజర్వాయర్ నీటిమట్టం 399 అడుగులైతే, ఇప్పుడు 382 అడుగులుగా ఉండటం గమనార్హం. ఈ మేరకు వారు సమీప గ్రామాలైన రావాడ, రావాడ రామభద్రపురం, మరికొన్ని గ్రామాల ప్రజలతో మాట్లాడి అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పంట నష్టం పరిశీలన


పంటను పరిశీలిస్తున్న అధికారులు

మక్కువ: తుఫాన్ ప్రభావంతో వీచిన ఈదురు గాలులకు మండలంలోని శంబర, చెముడు గ్రామాల పరిధిలో అరటి, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో ఉద్యానవనశాఖ అధికారి ప్రత్యూషబాను సోమవారం ఆయా గ్రామాల్లో పర్యటించి, పంట నష్టాలను పరిశీలించారు. అర్హులైన రైతులకు నష్టపరిహారం అందించేలా చర్యలు చేపడతామన్నారు. ఎంపీటీసీ సభ్యులు తిల్ల పోలినాయుడు, రెవెన్యూ, ఉద్యానశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్లు

గుమ్మలక్ష్మీపురం: ఇటీవల కురుస్తున్న వర్షాలకు దుడ్డుకల్లు పంచాయతీ పరిధిలోని కొత్తవలస గ్రామం లోగల బ్రిడ్జి సమీపంలో ఉన్న చెట్లు రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. గ్రామ సర్పంచ్ స్పందించి పారిశుధ్య కార్మికులతో ఆ చెట్టును తొలగింపజేశారు.


రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్లును తొలగిస్తున్న దృశ్యం

కారిపోతున్న కళాశాల భవనం

● ఇబ్బంది పడుతున్న విద్యార్థులు, అధ్యాపకులు


స్టోర్‌రూంలో చేరిన నీరు

గుమ్మలక్ష్మీపురం: భద్రగిరిలో ఉన్న గిరిజన గురుకుల జూనియర్ కళాశాల భవనం వర్షాలకు పూర్తిగా కారిపోతుంది. ఈ భవనాన్ని 1985 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ప్రారంభించారు. ప్రస్తుతం ఈ భవనం శ్లాబు పూర్తిగా పెచ్చులూడుతూ వర్షానికి, కారిపోతుంది. క్లాస్‌రూంలు నీటితో నిండిపోతున్నాయి. స్టోర్ రూం, క్లాస్‌రూం, వరండా, స్టాఫ్‌రూం, చివరకు ప్రిన్సిపాల్ గది కూడా కారిపోతుంది. దీనిపై ప్రిన్సిపాల్ యుగంధర్‌ను వివరణ కోరగా తాను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లానని, సంబంధిత ఇంజనీర్లు కూడా వచ్చి ప్రతిపాదనలు చేశారని చెప్పారు.

గోముఖిలోకి దిగి ఆవు మృతి

మక్కువ: గోముఖి నదిలోకి దిగి ఆవు మృతి చెందిన సంఘటన సరాయివలసలో చోటుచేసుకుంది. ఆ గ్రామానికి చెందిన అల్లు రవి ఐదు రోజుల కిందట గోముఖి నది అవతల ఒడ్డుకు పశువులను మేతకు తీసుకెళ్లాడు. అయితే అదే రోజు పశులతో తిరిగి రాగా.. నదిలో వరద ఉధృతికి ఓ ఆవు కొట్టుకుపోయింది. అప్పటి నుంచి గాలింపు చర్యలు చేపట్టగా.. సోమవారం నదిలో ఇసుక మేటల మధ్య ఆవు కళేబరం కనిపించింది. దీంతో సంబంధిత రైతు పశు వైద్యాధికారులకు సమాచారం అందించారు.

బిక్కుబిక్కుమంటున్న 'బాసంగి'

● రెడ్ అలర్ట్‌తో నిర్వాసితుల ఆందోళన

జియ్యమ్మవలస: మండలంలోని నిర్వాసిత పంచాయతీ బాసంగి బిక్కుబిక్కుమంటోంది. జిల్లాకు వాతావరణశాఖ రెడ్ అలర్ట్‌గా ప్రకటించడంతో గ్రామంలో ఉన్న ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం ఒడిశా రాష్ట్రంలో వర్షాలు కురవనున్న నేపథ్యంలో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని రేయింబవళ్లు కంటి మీద కునుకు లేకుండా జీవిస్తున్నారు. నాగావళి రిజర్వాయర్ ఎఫ్ఆర్ఎల్ 105 మీటర్లు కాగా ప్రస్తుతం 103.90 మీటర్ల నీటి మట్టం ఉండటం వల్ల వీరు మరింత ఆందోళన చెందుతున్నారు. అయితే 2004-05 ఆర్థిక సంవత్సరంలో ఈ పంచాయతీని నిర్వాసిత గ్రామంగా ప్రకటించారు. అప్పటి నుంచి దాదాపు రెండు దశాబ్దాలైనా వీరికి ఇళ్లు మంజూరు చేయక, ఉన్న సమస్యలు పరిష్కరించక తీవ్ర ఇబ్బందులు పడుతూ మొండి గోడల మధ్య శిథిలమైపోతున్న ఇళ్లల్లో జీవనం సాగిస్తూ వస్తున్నారు. ప్రతిఏటా వర్షా కాలంలో వీరికి భయం వదలడం లేదు. అయితే నిర్వాసిత గ్రామ ప్రజలను ఇప్పటికే అప్రమత్తం చేశామని, స్థానికంగా వీఆర్వోను ఉంచామని, తహసీల్దార్ డీవీ సీతారామయ్య తెలిపారు. సోమవారం సాయంత్రం వరకు ఎటువంటి ప్రమాద సూచిక కనిపించలేదని ఆయన స్పష్టం చేశారు.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

● మంత్రి సంధ్యారాణి ● చంద్రబాబు అరెస్టుకు ఏడాది


సాలూరు: మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు: గత ఐదేళ్ల వైసీపీ జగన్ పాలన టెర్రరిస్టులను తలపించేలా సాగిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. సోమవారం సాలూరులోని తన నివాసంలో ఆమె స్థానిక విలేకర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా నాయకుడు చంద్రబాబునాయుడును అరెస్టు చేసి నేటికి సరిగ్గా ఏడాది పూర్తయ్యిందని అన్నారు. అరెస్టు సమయంలో అనేక దేశాల్లో ఆయనకు మద్దతుగా సంఘీభావ ప్రదర్శనలు చేశారని గుర్తు చేశారు. ఐదేళ్ల జగన్ పాలనలో లూటీలు, నేరాలు, కక్షలు, కార్పన్యాలతో పనిచేస్తే కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు (చిట్టి), మండలాల అధ్యక్షులు గుళ్ల వేణుగోపాలరావు, పిన్నింటి ప్రసాద్‌బాబు, ఆముదాల పరమేష్, కౌన్సిలర్ హర్షకుమార్, డొంక అన్నపూర్ణ, తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

చీకటి దినం..

గుమ్మలక్ష్మీపురం: టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబును అరెస్టు చేసి నేటికి ఏడాది అయిందని కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి అన్నారు. ఈ రోజు చీకటి దినంగా భావిస్తున్నామని చెప్పారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత వైసీపీ ప్రభుత్వం కక్షతో చంద్రబాబును అరెస్టు చేసిందని, ఈ అరెస్టుకు తగిన మూల్యం చెల్లించుకుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రస్తుత వరదల్లో తన వయస్సు లెక్క చేయకుండా రాత్రి, పగలు పనిచేస్తున్నారన్నారు.

అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలి


ధర్నా నిర్వహిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

పార్వతీపురంటౌన్: కండక్టర్లపై పార్వతీపురం డిపో మేనేజర్ దుర్గాదేవి అక్రమ సస్పెన్షన్లను ఎత్తి వేయాలని ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ మన్యం జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు రెండో రోజు సోమవారం స్థానిక డిపో గేటు వద్ద వర్షంలో ధర్నా నిర్వహించారు. కండక్టర్లు గణపతి, అప్పన్న, ఎంఎస్‌మణిలను అక్రమంగా సస్పెండ్ చేయడం బాధాకరమని ఆయన అన్నారు. డీఎం వైఖరి వల్ల ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిపో కార్యదర్శి కె.నర్సింగరావు, అధ్యక్షుడు డి.అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బంద్ వాయిదా


మాట్లాడుతున్న కొండబాబు

కొమరాడ / జియ్యమ్మవలస: అంతర్ రాష్ట్ర రహదారి మరమ్మతుల విషయంలో 10వ తేదీలోగా చర్యలు తీసుకోకపోతే రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం కూనేరు వద్ద అదే రోజు చేపట్టాల్సిన బంద్ ఈనెల 20వ తేదీకి వాయిదా వేశామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కొల్లి సాంబమూర్తి, ఒడిశా రాష్ట్రం రాయగడ జిల్లా లారీ అసోసియే షన్ నాయకుడు కె.కొండబాబు ప్రకటించారు. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వాయిదా వేయక తప్పలేదని వారు అన్నారు.

ఎన్‌సీఎస్ కార్మికులతో ఎమ్మెల్యే సమావేశం

సీతానగరం: లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారంలో కార్మికులు, నాయకులతో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సోమవారం సమావేశమయ్యారు. ఇటీవల కర్మాగారంలో జరిగిన దొంగతనంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్ఐని ఆదేశించారు. దీనిపై ఎస్పీతో కూడా మాట్లాడతానన్నారు. దొంగతనం సంఘటనపై, కర్మాగారంపై ఎన్‌సీఎల్‌టీ అధికారులతో మాట్లాడారు. దీంతో పాటు కర్మాగారంలో గానుగపై చర్చించారు. కార్మికులకు రావల్సిన బకాయిలు ఇప్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో జాప్యమెందుకు?

సాలూరు రూరల్: తాను మంజూరు చేయించిన వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేయించడంలో జాప్యమెందుకని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర ప్రశ్నించారు. ఆయన సోమవారం సాలూరులో విలేకర్లతో మాట్లాడారు. తన హయాంలో పలు అభివృద్ధి పనులు మంజూరు చేయించి, శంకుస్థాపనలు చేశానని చెప్పారు. వాటిని సత్వరమే పూర్తి చేయించాలని ఆయన కోరారు.

వరద బాధితులకు సాయం


సీతానగరం: ఎమ్మెల్యే విజయచంద్రకు విరాళం అందజేస్తున్న టీడీపీ నాయకులు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: విజయవాడ వరద బాధితులకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తరఫున రూ.లక్షా 25వేల చెక్కును ఆ సంఘ ప్రతినిధులు కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్‌కు అందించారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి చెక్కును అందజేశారు. చెక్కును అందజేసినవారిలో ఐఎంయూ సంఘం ప్రతినిధులు, స్థానిక డాక్టర్లు వై.వివేక్, వై.పద్మజ, వాగ్దేవి, ప్రతిమాదేవి, వాసుదేవరావు, హేమంత్, పవన్‌కుమార్, తవిటినాయుడు ఉన్నారు.

● **సీతానగరం:** కాశీపేట గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ, టీడీపీ నేత తెంటు వెంకటప్పలనాయుడు తుఫాన్ బాధితుల కోసం రూ.25 వేలు సహాయాన్ని ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు సోమవారం అందజేశారు. నియోజకవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున విరాళాలు అందజేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ

గుమ్మలక్ష్మీపురం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సోమవారం గుమ్మలక్ష్మీపురంలో విరాళాలు సేకరించారు. వరద బాధితులకు మానవతా దృక్పథంతో ఆర్థిక సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంపటాపు భారతి, కళావతి, జనసేన కురుపాం ఇన్‌చార్జి కద్రక మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి


ధర్నా చేస్తున్న దళిత కాలనీవాసులు

పాచిపెంట: తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ స్థానిక దళిత కాలనీవాసులు సోమవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం అడ్మినిస్ట్రేట్ ఆఫీసర్ పాత్రోకు వినతి పత్రం అందజేశారు. దళితకాలనీలో కొళాయి పాయింట్లు ఉన్నప్పటికీ నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని వాపోయారు. తమ కాలనీలో ఇటీవల బోరు వేసి, ట్యాంకు అమర్చారు.. కానీ బిల్లు మంజూరు కాకపోవడంతో తొలగిస్తామని పంచాయతీ నిర్వాహకులు చెబుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

మహిళా సమాఖ్య నూతన కార్యవర్గం

వీరఘట్టం: వెలుగు కార్యాలయ సమావేశ మందిరంలో ఎంఎంఎస్ సర్వసభ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షురాలిగా కనుగుల లలితకుమారి, ఉపాధ్యక్షురాలిగా కందుల చంద్రకళ, కార్యదర్శిగా ఎం.కళావతి, ఉప కార్యదర్శిగా పైల పార్వతి, కోశాధికారిగా బలివాడ శ్రీదేవిని ఎన్నుకున్నారు. ఏపీఎం బి.శివున్నాయుడు, సమాఖ్య అధ్యక్షులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతాఫలం ధర పతనం

సీతంపేట: సీతంపేట ప్రాంతంలో విరివిగా సాగుచేస్తున్న సీతాఫలం ధర భారీగా తగ్గిపోవడంతో ఆదివాసీలు తీవ్రంగా నష్టపోయారు. గత వారం పోల్చుకుంటే ఈ సోమవారం ధర భారీగా తగ్గిపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇదే అదునుగా మైదాన ప్రాంత వ్యాపారులు ధరను నియంత్రించడంతో 20 కేజీల బరువు ఉన్న సీతాఫలం బుట్ట 150 ధర నిర్ణయించి కొనుగోలు చేసే పరిస్థితి ఏర్పడింది. ఇదే 20 కేజీల సీతాఫలం గత వారం వెయ్యి రూపాయలు వరకు ధర పలికినప్పటికీ వర్షాలు కారణంగా వ్యాపారులు ధరను నియంత్రించారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో వ్యాపారులు నిర్ణయించిన ధరకే సీతాఫలం అమ్మకాలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పెద్ద ఎత్తున గిరిజనులు సీతాఫలం అమ్మడానికి తీసుకురావడం, తిరిగి వీటిని ఇంటికి తీసుకెళ్లలేని స్థితిలో ఏదో ఒక ధరకు అమ్మకాలు చేపట్టి ఉద్దేశంతో గిరిజనులు తక్కువ ధరకు అమ్మకాలు చేపట్టారు. వీటిని నిల్వ ఉంచడానికి వీలు లేకపోవడం, వర్షాలు కురవడం వల్ల తక్కువ ధరకు అమ్ముతున్నారు. పర్లాకిమిడి, హిరమండలం, బరంపురం, విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి వీటిని కారుచౌకగా కొనుగోలు చేసుకున్నారు.

క్లుప్తంగా..

తోణాంలో జ్వరాలు

సాలూరు రూరల్: తోణాం గ్రామంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అనేకమంది జ్వరాల బారిన పడ్డారు. జ్వరాలపై ఇంటింటి సర్వే చేస్తామని తోణాం పీహెచ్‌సీ వైద్యాధికారిణి సుజాత తెలిపారు. పీహెచ్‌సీకి వచ్చే వారికి చికిత్స అందిస్తున్నామని చెప్పారు. గ్రామంలో పారిశుధ్య పనులు పూర్తిస్థాయిలో చేపట్టాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించామని ఈవోపీఆర్డీ ప్రసాద్ చెప్పారు.


ఆన్‌లైన్‌లో అటవీ ఉత్పత్తుల విక్రయం

భామిని: అటవీ ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో విక్రయించేందుకు హోలీ క్రాస్ స్వచ్ఛంద సంస్థ తమ వంతు సహకారం అందిస్తుందని సంస్థ డైరెక్టర్ కె.ప్రభుదాస్ తెలిపారు. ఈ మేరకు సోమవారం మానగూడ గ్రామంలో మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. చీపుర్లు, చింతపండు, జీడి, కంది, కందులు, రాగులు, సోమలు, ఊదలు, కొర్రలు అన్నింటినీ ప్యాకింగ్ చేసి విక్రయించడం వల్ల అనుకూలమైన ధర పలుకుతుందని, దీనికి తమ వంతు అన్ని విధాలుగా సహకరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, హోలీక్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లపై కేసులు

సీతంపేట రూరల్: అధిక లోడుతో ప్రయాణిస్తున్న ఆటో డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ జగదీష్‌నాయుడు తెలిపారు. సోమవారం సీతంపేటలో వాహన తనిఖీల్లో భాగంగా మితిమీరిన వేగంతో, అధిక లోడుతో వెళ్తున్న ఐదు ఆటోలను గుర్తించి, వారిపై కేసు నమోదు చేశామని ఆయన చెప్పారు.

ప్రమాదమైనా తప్పక..


మోటార్ వద్ద తీగలను కలుపుతున్న యువతి

సాలూరు రూరల్: మరిపిల్లి పంచాయతీ కాకుడు వలసలో తాగునీటి ట్యాంకు మోటార్ ఆన్ చేసేందుకు స్విచ్ లేకపోవడంతో ఆ గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు. మోటారు ఆన్ చేసేందుకు సహసం చేయాల్సి వస్తోంది. కర్ర సహాయంతో రెండు తీగలను కలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే ప్రమాదం తప్పదు.

19న జీసీఎంఎస్ ఎన్నికలు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం గిరిజన కార్పొరేషన్ మార్కెటింగ్ సొసైటీ ఎన్నికలు ఈనెల 19న నిర్వహించనున్నట్టు జీసీసీ మేనేజర్ కృష్ణ ప్రసాద్ తెలిపారు. 11న నామినేషన్ల స్వీకరణ, 12న స్క్రూట్నీ, 19న ఎన్నికలు ఉంటాయని చెప్పారు. ఈ ఎన్నికలు గుమ్మలక్ష్మీపురం జీసీఎంఎస్ కార్యాలయంలో నిర్వహిస్తారన్నారు. ఐదుగురు డైరెక్టర్లను ఎన్నుకుంటారన్నారు. ఎస్టీ అభ్యర్థులు మాత్రమే ఈ ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హులని ఆయన తెలిపారు.